
ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ ముందుమాటతో...

కన్నడలో 'ఎదెగారికె' పేరుతో సినిమాగా వచ్చి అటు ప్రేక్షకుల్ని
ఇటు విమర్శకుల్ని మెప్పించి అవార్డులతో సంచలనం సృష్టించిన నవల

# తెగింపు

## The Guts

A novel is not necessarily
a work of fiction
*-Eric Ericson*



కన్నడ మూలం : అగ్ని శ్రీధర్
తెలుగు అనువాదం : సృజన్

So grant him life, be reckon
That the grave which housed him
May not be empty now:
You in his spotted garments
Must yourself lie wrapped

**- Robert Graves**

# తెగింపు

*The guts*

కన్నడ మూలం : అగ్ని శ్రీధర్

తెలుగు : సృజన్

TEGIMPU (Edegarike in Kannada) a
Short novel by **Agni Sreedhar**
Translated from Kannada by
**Srujan**

**Sufi Prachuranalu**
C/o sabina parlapati,
6-3-200, 3rd Floor,
Opp: K.B.Apartments, Premnagar,
Chintalbasthi, Khairathabad,
Hyderabad -04.
Cell : 96034 29366

First Edition: 2015

***Copies available at:***
Bhoomi, 31st Ward
Behind National College,
Vidya Nagar, Hospet - 583 201
Ph: 09481663379

***or***

**Visalandhra Book House,** Bank Street, Hyd. and its branches in A.P. & T.S.
**Prajashakti Book House,** Hyd. and its branches in A.P. & T.S.
**Navodaya Book House,** Kachiguda, Hyd.,
**Navodaya Publishers,** Eluru Road, Vijayawada.

E-book: www.kinige.com

Cover: Lepakshi, Hyderabad
Layout : Mallesh Sampangi

Printed at: Anupama Printers
126, Shanthinagar, Hyderabad-28

Price: Rs. 70/-

# రక్తపు మరకల వెనుక ఒక పశ్చాత్తాపం గురించి...

**రామ్ గోపాల్ వర్మ**

In a game of violence
only the game
wins and never the players

'చంపినప్పుడు మనం చావటానికి కూడా సిద్ధంగా ఉండాలి. మన నిజమైన సామర్థ్యం తెలిసేది మనం చావుని ఎలా ఎదురించగలం అనే దాని కన్నా మనకి మన 'ఎండ్' ముందే తెలిసిపోవడం'.

నేను ఇదివరకు ఎన్నో అండర్ వరల్డ్ బ్యాక్‌డ్రాప్‌తో సినిమాలు తీసినప్పటికీ నన్ను విపరీతంగా కదిలించిన పుస్తకం ఇది. దీని గొప్పతనం పాఠకులకి మచ్చుకైనా కనిపించని హింస, రక్తపాతం.

'అతడి మాటల్లో నాకు నమ్మకం కలగలేదు. ఏ జంతువైనా కాని చావు దగ్గరికి వచ్చినప్పుడు అది తెగించి పోరాడుతుంది. అతడు నేరస్తుల ప్రపంచంలో బాగా పరిణితి చెందినవాడు. విసిరే కత్ర నుండి తప్పించుకున్న తర్వాత ఏదైనా జరగవచ్చుననే సామాన్యమైన ఇంగిత జ్ఞానం అతడికి ఉండాలి. బహుశా నా

నోటి నుండి అతను తన చావు సంగతిని తెలుసుకోవాలనీ ప్రయత్నిస్తూ ఉండవచ్చు లేక నా నుండి తనపై జాలి కలిగేలా చేసి ఇక్కడి నుండి తప్పించుకునే ఆలోచన చేస్తూ ఉండవచ్చుననే అనుమానం నాలో కలగసాగింది'.

'తెగింపు'లో హత్య కాబోయే వ్యక్తి హత్య చేయబోయే వ్యక్తి ఎదురుగా కూర్చొని గుండె తలుపుల్ని తెరుచుకునే తీరు కచ్చితంగా నేనింతవరకు చదవని సరికొత్త సృష్టి అని చెప్పగలను.

రచయితగా శ్రీధర్ గారిలో ఒక అంతర్లీనమైన ఫైర్ ఉంది. పుస్తకం ముగిసే వరకూ నాకు శ్రీధర్ గుర్తుకొచ్చారు. ఇక్కడి అక్షరాల వెనుక నాకు రక్తపు తడి కనిపించలేదు. చివరివరకు వెంటాడిన ఒక పశ్చాతపం కనిపించింది.

బాస్ ప్రతిసారీ 'హత్య'ని గుర్తు చేసినప్పుడు శ్రీధర్ ఎంతో శాంతంగా జవాబిచ్చే తీరు, నిర్లిప్తత మనోనిబ్బరం నన్ను విచలితుణ్ణి చేసింది. శ్రీధర్ పరిస్థితిని, అతడి క్షోభను అర్థం చేసుకోగలను. ముఖ్యంగా ముంబై కిల్లర్ తను ఫీల్డింగ్ కోసం ఇక్కడికొచ్చి చాలా పకడ్బందీగా ట్రాప్ కాబడ్డ సంగతిని శ్రీధర్ గారితో ప్రస్తావించేటప్పుడు ఆయన స్పందన ఒక్కోసారి ఒళ్ళు జలదరిస్తుంది.

'అతడి మాటలని వింటుంటే, ఎంత దుర్భరమైన ప్రపంచంలో నేనున్నట్టు అనిపించసాగింది. ఇక్కడ ఎవరు ఎవరిని అంతం చేయటానికి ప్రయత్నిస్తున్నారు? ఎవరు ఎవరిని రక్షించడానికి ప్రయత్నిస్తున్నారు ఒక్కటీ అర్థం కాలేదు. అంతం చేయటమే తమ ధ్యేయమనీ భావిస్తున్న ఈ ప్రపంచంలో, నిరంతరంగా ఎవరినైనా అంతం చేయటమే జీవితానికి విలువనిచ్చే మార్గమేమోననీ అనిపించసాగింది...'

ముంబై కిల్లర్ పాత్ర నాలో కుతూహలాన్ని రెకెత్తించింది. బహుశా అతడు బతికుంటే కచ్చితంగా నేను కలిసేవాణ్ణి. అతడు మరణానికి దగ్గరైనకొద్దీ అతడిలో తను ప్రేమించే అమ్మాయిగురించిన తపన, అతడి ప్రేమలో ఉన్న నిజాయితి విస్మయపరుస్తుంది.

'తను ఒకరకమైన పంతంతో నా మనసుకు దగ్గరయింది. నన్ను మార్చటంలోనే తన జీవిత సార్థకత్వం ఉందని చెప్పింది. నాలో మార్చవలసింది ఏమీ లేదనీ చెప్పినా ఆమె ఒప్పుకోలేదు. నేను నా ఆనందంకోసమో, పగకోసమో హత్యల్ని చేయలేదు. అలాగే చిన్నప్పటినుండి నాతో ఉన్న మనుషులు హత్యల్ని చేయలేదు. అయితే నాతో ఉన్న మనుషులు హత్య చేయటాన్ని డబ్బు సంపాదించే మార్గంగా

భావించే వాళ్లు. వాళ్లకి మంచి చెడు గురించిన అవగాహన తెలిసేది కాదు. వారి మధ్య ఇన్నేళ్లు ఉంటున్న నన్ను మార్చటం సాధ్యం కాని పని అన్నాను'.

పుస్తకం చదువుతున్నప్పుడు నా కళ్లెదుట ప్రతి దృశ్యం కళ్లముందు కదిలింది. అది పుస్తకం అసలు గొప్పతనం. అద్భుతమైన దృశ్యకథనంలా గుగుర్పాటుకు గురిచేసింది. కొన్ని రోజుల క్రితం చూసిన 'ఎదెగారికె' సినిమాని గుర్తు తెచ్చుకున్నాను. సుమన 'ఎదెగారికె' నవలకి చాలా అద్భుతమైన సెల్యులాయిడ్ రూపాన్నిచ్చింది. అద్భుతమైన పట్టుతో సినిమాని డైరెక్ట్ చేసిన తీరు సుమన అసాధరణ ప్రతిభకు నిదర్శనం.

రివాల్వర్ పట్టిన చేతిలో మల్లెలు వికసించినట్టు శ్రీధర్ రాత అబ్బుర పరుస్తుంది. మనల్ని మోహపరవశం చేస్తుంది. అత్యంత ఆసక్తితో ఆకట్టుకుంటుంది.

*31.12.14*
*ముంబై*

# గుండెల్ని తాకే నవల

మనిషి జీవితం, హత్య, మరణం, ప్రేమ గురించి ఒక ధ్యానం.

నేర ప్రపంచం చుట్టూ అల్లుకున్న ఒక వాస్తవ సంఘటన 'తెగింపు' కథా వస్తువు. సాధారణంగా అండర్‌వరల్డ్ గురించిన కథనాల్లో హింస, క్రౌర్యం విజృంభిస్తాయి. కానీ ఇక్కడ పశ్చాత్తాపం, జాలి, మనిషిలోని అంతర్యాన్ని తరిచి చెప్పే తీరు గుండెల్ని తాకుతుంది.

ఇందులోని సంఘటనలు ఏదో థ్రిల్ కోసం కావు. ఆయా పాత్రల సంఘర్షణ, విధ్వంసాలకు అద్దం పట్టినట్టు ఉంటాయి. నేరస్తుడిలో అంతర్గతంగా నెలకొన్న ప్రేమ, నమ్మకం, మోసం, ద్రోహం వీటన్నింటినీ అత్యంత మానవీయంగా ఆవిష్కరించి సరికొత్త కోణంలో చూపిన 'తెగింపు' ఇతర నేర ప్రపంచాల మాఫియా రచనలకన్నా విభిన్నంగా ఆకట్టుకుంటుంది.

అగ్ని శ్రీధర్‌గారికున్న అనుభవం, విపుల సాహిత్య పఠనం మాత్రమే కాదు, వారికున్న అపరిమిత జీవనోత్సాహం, ప్రజాపరమైన ఆలోచనలనుండి వచ్చిన రియలిస్టిక్ నెరేషన్ 'తెగింపు'ని ఒక అందమైన, అద్భుతమైన కథనంలా మార్చడంలో సఫలీకృతమైంది.

**– బంజగెరె జయప్రకాష్**

ప్రముఖ కన్నడకవి, విమర్శకుడు

# అగ్నిపూల వర్షంలో తడవడానికి రెడీ అవ్వండి

నాకు తెలుసు. సృజన్ ఏమి చేసినా గట్టిపనే చేస్తాడని. నాకున్న అతికొద్ది పరిచయంలోనే అతన్ని అంచనా వేశాను. కానీ బతుకంటే ఈతిబాధలమయం కదా! ఆ బాధలమయంతోనే – ఈ నవలను నా దగ్గర ఉంచుకుని కూడా కొద్ది రోజుల వరకు చదవలేకపోయాను. చదివాక... ఈ రెండు ముక్కలు రాయకుండా ఉండలేకపోతున్నాను.

నిజానికి సృజన్ అనువాదంలోని తప్పొప్పులను చూడమని డ్రాఫ్టుని కొరియర్‌లో పంపాడు. ఆ డ్రాఫ్టును అలాగే జాగ్రత్తగా కొద్దిరోజులపాటు మా అద్దెంటి అటక మీద పెట్టాను. ఒకానొక రాత్రి ఇంకా ఆలస్యం చేస్తే పరువుండదని అటకదింపి నవలను చదివి అసలు విషయం – అదే తప్పొప్పులను చూసే విషయం మర్చిపోయి ఇదిగో ఇలా తగుదునమ్మా... అని ఈ రెండు ముక్కలు రాయడానికి ఉపక్రమించాను.

సృజన్ అడక్కపోయినా మొహమాటంలేకుండా నేనీ రెండు ముక్కలు రాయడానికి ఉపక్రమించానంటే అది ఈ నవల నాలో కలిగించిన బలహీనత అని నిస్సంకోచంగా చెప్ప దల్చుకున్నాను. నవల చదువుతున్నంతసేపు మృత్యువు భుజమ్మీద చెయ్యేసుకుని అలా సరదాగా కబుర్లు చెబుతూ నడిచిన ఫీలింగ్. చావుబతుకుల తాత్వికత నీడలా పరుచుకుని అక్షరాల వెంట పరిగెత్తిస్తుంటే క్షణాల్లో నవల చదవడం పూర్తయ్యింది.

మూల రచయిత అగ్ని శ్రీధర్‌కు ఆ పేరు ఎలాపెట్టారో, ఎందుకు పెట్టారో తెలియదు కానీ అతని అక్షరాలు మాత్రం నిజంగానే నిప్పులు రాలుస్తున్నాయి. ఆ నిప్పుల వెలుగుల్ని అలాగే ఒడిసి పట్టుకుని అత్యంత సరళమైన తెలుగులోకి ప్రసరింపజేసిన అనువాదకుడు సృజన్ ముమ్మాటికీ అభినందనీయుడని ఈ నవల చదివాక మీరే చెబుతారు.

**వేంపల్లె షరీఫ్**

కథారచయిత, కేంద్రసాహిత్య అకాడెమి యువపురస్కార గ్రహీత

10 నవంబరు 2014, హైదరాబాద్

# నేను - తెగింపు

... he will suffer for his mistake
That will be punishment as well as the prison

- Dostoevsky

'తెగింపు' 80వ దశాబ్దంలో జరిగిన యథార్థ గాథ

ఇక్కడి పాత్రలన్నీ కల్పితంకాదు. అన్ని పాత్రలు ఇంకా బతికే ఉన్నాయి.

ఇక్కడ హత్య చేయబోయేవాడు, హత్య కాబోయే వ్యక్తి ఇద్దరూ ముఖాముఖిగా కూర్చుని వారి వారి అంతరంగాల ఆవిష్కరణ చేస్తారు. నేర ప్రపంచపు అలిఖిత నియమాలకి కమిట్ అవుతారు.

ఇలాంటి వినూత్నమైన రచన మొదటిసారి చదివినప్పుడు విహ్వలంతో ఒళ్లు జలదరించింది. బహుశా ఇదే కారణం నన్ను ఈ పుస్తకం తెలుగు అనువాదానికి ప్రేరేపించింది.

నామీద అమితమైన నమ్మకంతో అనువదించడానికి అనుమతి ఇచ్చిన అగ్ని శ్రీధర్‌గారు, తమ తిరికలేని షెడ్యూళ్ల మధ్య ఆసక్తిగా చదివి ముందు మాట రాసిన దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ, ప్రముఖ సినీ గేయ రచయిత సిరాశ్రీ, అనుమతికి సహకరించి, శ్రద్ధగా సందేహాల్ని తీర్చిన సుమన కిత్తూరు, అడిగిన వెంటనే అద్భుతమైన కవర్‌పేజ్ గీసిన ఆర్టిస్ట్, కార్టూనిస్ట్ లేపాక్షి, మిత్రుడు సందీప్ నాయక్, కథకుడు ఆత్మీయ మిత్రుడు వేంపల్లె షరీఫ్, డి.టి.పి. చేసిన మల్లేశ్...

సహచరి శ్యామల, చిన్నారి భూమి.

అందరికీ
కృతజ్ఞతలతో
**సృజన్**

అది నా నిర్ణయం కాదు. బాస్ తీసుకున్న నిర్ణయం. ఆ నిర్ణయం తీసుకోవడానికి చాలా కారణాలున్నాయి. అదికాక బాస్ హింసను ఇష్టపడరు.

అతడిని ఫినిష్ చేయడం తప్పనిసరి. బాస్ నాకు కబురు పంపినప్పుడు సమయం ఉదయం పదిగంటలు. అతడి గురించి రెండ్రోజుల క్రితం బాస్ నాతో మాట్లాడారు. ముంబైలో హాయిగా ఉండేవాడు ఉండక బాస్‌ని ఫినిష్ చేసే ప్లాన్‌లో పాల్గొన్నాడు. అదే ఇప్పుడు అతనికి ప్రాణం మీదికి తెచ్చింది. బాస్ కోపానికి కారణమైంది.

ముంబై నుంచి అతడి గురించిన వివరాలు తెలుస్తూనే ఉన్నాయి. అతడు ఉన్న చోటు కూడా తెలిసింది.

ఉదయం బాస్ స్వయంగా వెళ్లి అతడు నివసిస్తున్న ఇంటిముందు నిలబడ్డప్పుడు అతడు కొద్దిగా కంపించాడు. కానీ ఏం మాట్లాడకుండా వచ్చి కార్లో కూర్చున్నాడు.

బెంగళూరులో అతడిని ఫినిష్ చేస్తే, ఎప్పటికైనా తనకి ఇబ్బంది ఎదురవుతుందని బాస్ సకలేశపురంలోని తనకు బాగా పరిచయమున్న స్నేహితుడి ఫారంకి తీసుకెళ్లి, అతడ్ని అంతం చేయాలని నిర్ణయించాడు.

నా సలహాల మీద బాస్‌కు బాగా గౌరవం. అందుకే తనతో పాటు నన్ను రమ్మని పిలిచాడు. నేను బయలుదేరాను. నాకు వ్యక్తిగతంగా బాగా పరిచయమున్న ఒక కుర్రాణ్ని వెంట తీసుకెళ్లటానికి బాస్ సమ్మతించాడు. మిగతా కుర్రాళ్లంతా బాస్‌కు బాగా నమ్మకం ఉన్నవాళ్లు.

అతడికి ఏ విషయం చెప్పలేదు. అతడిని ముంబైలోని బాస్ తన అడ్వయిజర్‌తో మాట్లాడించాం. ఇక్కడికొచ్చి హత్యకి పాల్పడ్డం తప్పని ముంబై గొంతు చెప్పినప్పుడు 'నేను ఈ పని చెయ్యకుండా ఉండాల్సింది. కానీ భాయ్ చెప్పినప్పుడు కాదనలేకపోయాను' చల్లగా చెప్పాడు.

అతడి చేతి నుండి ఫోన్ తీసుకున్న బాస్‌తో ముంబై అడ్వయిజర్:

'ఇస్‌కో ఉడాదో. అతడ్ని లేపేయ్' అన్నాడు.

ఇప్పుడు అతడితో మాట్లాడ్డానికి నన్ను ఎంచుకున్నారు బాస్. మిగతావారు పొరబాటున అతడితో హేళన చేస్తూ మాట్లాడితే తనని చంపబోయే సంగతి అతడికి తెలిసిపోగలదనే భయం బాస్‌ది. ఒకవేళ అలా జరిగి దారి మధ్యలో అతడు గొడవ చేస్తే ఇబ్బందవుతుందని, నాకు మాత్రం అతడితో చనువుగా ఉండాలని చెప్పారు.

నా మీద బాస్‌కు గొప్ప నమ్మకం.

నేను అతడిని మొట్టమొదటిసారి చూసింది బాస్ ఇంట్లో. దాదాపు ముప్ఫై ఏళ్లుండచ్చు. స్మార్ట్‌గా ఉన్నాడు. కుడిచెవికి చిన్న రింగు. ముంబై అండర్‌వరల్డ్‌లో అతడికి మంచి పేరుంది. కానీ అతడి మొహంలో దాన్ని సమర్థించే ఏ లక్షణాలు కనిపించలేదు!

బాగా సౌమ్యంగా కనిపించే ముఖం అతడిది. నేను కొంచెం సీరియస్‌గానే మాటలు మొదలుపెట్టాను. అతడు ముంబైలో నివాసముంటున్నప్పటికీ మంగళూరు వ్యక్తి కావడం చేత కన్నడ బాగానే వస్తుంది.

"నీకెందుక్కావాల్సొచ్చింది... ఈ గొడవ. హాయిగా నీ పని నువ్వు చేసుకుంటూ ముంబైలో ఉండక ఇక్కడికి గేమ్ ఆడటానికి ఎందుకొచ్చావ్?"

రెండు నిమిషాలు ఏం మాట్లాడలేదు. నా ముఖాన్నే గంభీరంగా చూశాడు.

"మీ పేరు..?" చెప్పాను.

"చూడండి మీరు కూడా ఫీల్డులో ఆరితేరారు. నాపైన ఒక పెద్దాయన ఉన్నాడు. ఆయన ఋణంలో నేనున్నాను. అందుకే ఫీల్డింగ్‌కి నన్ను పంపించారు. దీంట్లో నా తప్పేముంది?"

జవాబు చెప్పకుండా అతడి వైపు చూడటం నావంతయ్యింది. ఫీల్డింగ్ అంటే ముంబై భాషలో వేటాడబోయే వ్యక్తిని బాగా దగ్గరుండి గమనించడం.

నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ అతడే అడిగాడు.

'ఇప్పుడు ఏం డిసైడ్ చేశారు?'

నేను లో గొంతుకతో అన్నాను – 'పెద్దాయన రెండు రోజులు ఆగమని బాస్‌కు చెప్పారు. అయినా ఇక్కడ కొంచెం వాతావరణం వేడిగా ఉంది. అందుకే నిన్ను బయటికి ఎక్కడికైనా తీసుకెళ్దామని ప్లాన్ చేస్తున్నాం'. అతడు గాఢంగా నిట్టూర్చాడు.

మేము సరిగ్గా పన్నెండు గంటలకి బయల్దేరాం.

బయల్దేరటానికి ముందుగా 'అతడి కళ్లకి గంతలు కట్టి సీటుకింద కానీ, కాళ్ల దగ్గర కానీ కూర్చోపెట్టుకుని వెళ్లడం సబబేనా' అని బాస్ నన్ను అడిగాడు. అవసరం లేదన్నాను. మధ్యలో అతడిని కూర్చోపెట్టుకొని ఒకవైపు నేను, మరోవైపు బలిష్టంగా ఉండే మరో కుర్రాణ్ని కూర్చోపెడదామని చెప్పాను. ఒకవేళ అతడేమైనా పోలీసుల్ని చూసి చౌరస్తాలో కానీ, రోడ్డుమీద కానీ అరవడం లాంటివి చేస్తే నేను అతడ్ని కంట్రోల్ చేస్తానని చెప్పాను.

బాస్‌కు నా సామర్థ్యం మీద బాగా నమ్మకం.

మేము బెంగుళూరు నుండి బయల్దేరాం. బాస్, అతడు, మేం నలుగురు వ్యాన్‌లో ఉన్నాం. మరో ముగ్గురు కూర్చున్న ఓ మారుతికారు మమ్మల్ని ఫాలో చేయసాగింది.

నెలమంగల క్రాస్ చేరేవరకు వ్యాన్‌లో మాటల్లేవు. నిశ్శబ్దంగా ఉంది. కుణిగల్ క్రాస్ దగ్గర దాబా హొటళ్లు కనిపించగానే అతడు 'చాయ్ తాగుదామా?' అన్నాడు.

బాస్ ఆందోళనగా నావైపు చూశారు. నేను బాస్‌వైపు చూశాను. బండి ఆపుదామని బాస్‌తో చెప్పాను. రోడ్డు పక్కలో బండి పార్క్ చేశాం. వెనక వస్తున్న కారులోని వ్యక్తులకి చాయ్ తెమ్మని చెప్పాం.

అక్కడో చిన్న సైజు గుంపు కనిపించింది. ఒకవేళ అతడు అరిచి, పారిపోవడానికి ప్రయత్నిస్తే? ఒక్కసారిగా అనుమానమొచ్చింది నాకు.

అతడు చాలా మామూలుగా ఉన్నాడు. అతన్ని అంతం చేస్తామని తెలీక అలా ఉన్నాడనుకున్నాను.

అతడు తాపిగా సిగరెట్ వెలిగించాడు. నాకు ఆఫర్ చేశాడు. వద్దన్నాను. వ్యాన్ దగ్గరికి ఇద్దరు వ్యక్తులొచ్చి కుణిగల్ వరకు డ్రాప్ కావాలని అడిగారు. కుదరదన్నాం.

అతడు బాస్‌తో, “మీరు కొద్దిగా టెన్స్ అయినట్టున్నారు” అడిగాడు.

“ఏం లేదు” అన్నాడు బాస్.

బాస్, నేను కిందికి దిగి కొంత దూరం ఊరికే అలా నడుచుకుంటూ వెళ్లాం.

“చాలా స్మార్ట్‌గా ఉన్నాడు. ఏమీ తెలియనట్లు ‘ఎందుకు టెన్స్ అయ్యారు’ అని అడుగుతున్నాడు” అని చిరాగ్గా అన్నాడు బాస్.

“అతణ్ని ఫినిష్ చేస్తామని ఇంకా డౌటు రాలేదా?’ అన్నాను.

‘ఏమో! కాని అతడు క్లెవర్. బయటపడటం లేదు’ అన్నాడు బాస్

మేము టీ తాగి బయలుదేరాం.

ప్రస్తుతం వాతావరణం ఒక రకంగా రిలాక్స్ అయింది. హాసన్‌లో భోజనం కోసం బండి ఆపాం. అతడు కచ్చితంగా తప్పించుకు పోవడానికి ప్రయత్నించడని మాకు నమ్మకం కుదిరింది.

అతడు తృప్తిగా భోజనం చేశాడు. తర్వాత యూరినల్స్‌కి వెళ్లినప్పుడు బాస్ కనుసైగ చేస్తూ ఇద్దరిని అతడి వెంట పంపించాడు.

కానీ దాని అవసరం నిజంగా లేదు.

మేము హాసన్ నుండి బయలుదేరినప్పుడు సాయంత్రం ఐదయింది.

మేము బయలుదేరి ఇంకా పది నిమిషాలు కూడా కాలేదు. రోడ్డుకి ఒకవైపు ఒక పోలీసు జీపు, మారుతి వ్యాన్ నిలబడి ఉన్నాయి. మమ్మల్ని బండి ఆపమని చేయి అడ్డం పెట్టారు. బాస్ డ్రైవ్ చేస్తున్న కుర్రాడికి ఎట్టి పరిస్థితిలోనూ బండిని ఆపవద్దని చెప్పాడు.

బాస్ ఆందోళనతో నావైపు చూశాడు. మేము భయపడ్డాం. బాస్ దగ్గర, అతడి కుర్రాళ్ల దగ్గర పిస్టల్స్ ఉన్నాయి. సడన్‌గా బండి ఆపి చెక్ చేస్తే మేం పట్టుబడే అవకాశం ఉంది. దాంతో పాటు మేమెంతో పకడ్బందీగా వెంటతీసుకెళ్తున్న ‘అతడు’ తప్పించుకుపారిపోయే చాన్స్ కూడా ఉంది.

పోలీస్ జీప్, వ్యాన్ మమ్మల్ని వెంబడించసాగాయి. మా గురించి ఏ కంప్లయింట్లూ లేవు. బహుశా ఎవరి కోసమో ఎదురుచూస్తూ అనుమానంతో, పొరపాటుగా మాకు చేయి అడ్డం పెట్టి ఉండొచ్చు. మనం బండి ఆపటం మంచిదని బాస్‌కు చెప్పాను. బాస్ పిస్టల్స్ గురించి ఆందోళన చెందాడు. కొంచెం వేగంగా దూసుకెళ్లి బండిలో నుంచి వాటిని బయటికి విసిరేద్దాం అన్నాను.

అది తప్పనిసరి. మేము జీప్ నుండి చాలా దూరంలో ఉన్నాం. రోడ్డు మలుపులో మూడు పిస్టల్స్‌ని ఒక బ్యాగులో వేసి నిర్జన ప్రదేశంలో దాన్ని విసిరేశాం. అది ఎవరికీ కనిపించదు.

కొంచెం ముందుకెళ్లి బండి ఆపాం. మమ్మల్ని దాటి రోడ్డును ఘర్షిస్తూ బ్రేక్‌వేసి, జీపు మా ముందు ఆగింది. వ్యాన్ కూడా మా బండి వెనకే ఆగింది. జీపునుండి దిగిన ఇన్‌స్పెక్టర్‌తో పాటు కొంతమంది వేగంగా అడుగులేస్తూ వచ్చి మా వ్యాన్‌ను చుట్టుముట్టారు.

పోలీసులు మాకోసం రాలేదు. ఏదో వ్యానులో దాదాపు అర టన్ను టేకుచెక్క వెళ్తోందని అందిన ఇన్‌ఫర్మేషన్ వల్ల వాళ్లు మా వెంటపడ్డారు. మేము బండి ఆపక వేగంగా రావటంవల్ల వారిలో అనుమానం రెట్టింపైంది.

వెనుక సీటులో కూర్చున్న మేము కిటికీ అద్దాలని పూర్తిగా మూసినందు వల్ల కూడా వారిలో అనుమానం మరింత బలమైంది. బహుశా వెనుక సీట్లు తీసివేసి అక్కడ టేకు నింపామనే అనుమానంతో బండిని ఛేజ్ చేసారు.

"బండి ఎందుకు ఆపలేదు?" కొంచెం కరుగ్గా ఇన్‌స్పెక్టర్ అడిగాడు.

బాస్‌కు పోలీసులంటే భయం. నేను సముదాయించే పద్ధతిలో చెప్పాను.

"సాయంత్రం ఏడు గంటలకి ఒక ఫంక్షన్ ఉంది. అందుకే ఫాస్ట్‌గా వెళ్తున్నాం. అదీకాక మాకెలాంటి గిల్ట్ లేకపోవటం వల్ల బండిని ఆపలేదు."

ఇన్‌స్పెక్టర్ ఒక్క నిమిషం నన్ను ఎగాదిగా చూసి అడిగాడు, "ఏం చేస్తుంటారు?"

"ఐ యామ్ యాన్ అడ్వొకేట్."

ఇన్‌స్పెక్టర్ ఏం మాట్లాడలేదు. వెళ్లటానికి అనుమతిచ్చారు.

మేము కొంచెం ముందుకెళ్లి బండి ఆపి, వెనుక వస్తున్న కారులోని వ్యక్తులకి మేము విసిరిన పిస్టల్స్ తీసుకురమ్మని చెప్పాము. వారి వెంట మాతోబాటు బండిలో కూర్చున్న కుర్రాడు వెళ్లాడు.

'అతడు' ఆకాశంవైపు చూస్తూ సిగరెట్ తాగడంలో నిమగ్నమై ఉన్నాడు. నేను అతడి ముఖాన్ని చూస్తున్నాను. అది గమనించి అతడు నావైపు ప్రశ్నార్థకంగా చూశాడు. నేను గాఢంగా నిట్టూర్చాను.

పోలీసులు మమ్మల్ని ఆపినప్పుడు కచ్చితంగా అతడు వారికి తన పరిస్థితి గురించి కనుసైగలతో చెప్పి తప్పించుకోవటానికి ప్రయత్నించవచ్చనే అనుమానం మాలో ఉండేది. కానీ అతడు ఏమీ జరగలేదన్నట్టుగా కూర్చొని ఉన్నాడు. తనని చుట్టుముట్టిన మృత్యుఛాయ అతడికి కనిపించలేదా?

పదిహేను నిమిషాల్లో కుర్రాళ్లు బ్యాగ్ పట్టుకొని తిరిగొచ్చారు. వారు వచ్చేంతవరకు బాస్ ఆందోళనతో ఉన్నాడు. పొరపాటున ఆ బ్యాగ్ ఎవరైనా చూసి తీసుకెళ్లుంటే, ఏం చేయాలని ఆలోచిస్తున్నాడు. బాస్‌కు పిస్టళ్లంటే ఎంతో ప్రేమ.

తర్వాత మేము బయలుదేరాము.

సకలేశపురం చేరినప్పుడు దాదాపు ఏడుగంటలైంది. అక్కడున్న ప్లాంటర్స్ క్లబ్‌లోకెళ్లి హాయిగా కూర్చున్నాము. అక్కడున్న చాలామందికి, బాస్‌కు బాగా పరిచయముంది. వారు ఎంతో ఆసక్తిగా మా అవసరాలను గమనించారు.

బాస్ నన్ను పక్కకి తీసుకెళ్లి చేయాల్సిన పనుల గురించి చర్చించారు. తనకి కూడా పోలీసులు మమ్మల్ని తనిఖీ చేసినప్పుడు అతడు అరుస్తాడేమోనని ఆందోళన కలిగిందట.

"అలా జరిగి ఉంటే, ఏం చేయాల్సివచ్చేదో?" ఆసక్తిగా అడిగాడు బాస్.

"ఇప్పుడు దాని గురించి ఎందుకు ఆలోచించి తలబద్దలు కొట్టుకోవాలి?" అన్నాను నేను.

"బహుశా మనం అతడ్ని మిస్ చేస్తామని అతడికి తెలియదు" అన్నాడు.

అక్కడి నుంచి ఫారం సుమారు ఆరు కిలోమీటర్ల దూరం ఉంది. బాస్ క్లబ్‌లో భోజనం చేసి తొమ్మిది గంటల ప్రాంతంలో బయల్దేరదామన్నాడు.

మరుసటి రోజు అతడ్ని  ఫినిష్ చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించాం. అతడు చాలా సీరియస్‌గా ఒక బాటిల్ బీరు తాగాడు. ఒక్కోసారి తలెత్తి మావైపు చూస్తూ, తదేకంగా బాటిల్‌ని చూసేవాడు.

మేము పెద్ద గొంతుతో కబుర్లు చెప్పుకుంటున్నాము. నా చూపుల్ని తప్పించుకునే సందర్భాల్లో మాత్రం అతడు ఊరికే నవ్వుతూ చెంపలు కదిలించేవాడు.

తొమ్మిదిన్నరకి ఫారం చేరాము. ముందే కబురు చేయడంవల్ల బాస్ కజిన్ మాకు పడుకోవటానికి ఏర్పాట్లు చేశాడు. ఇంజనీరింగ్ చదివిన అతడు, ఉద్యోగం చేయటం ఇష్టంలేక ఫారం పెట్టుకున్నాడు.

చీకటి చిక్కగా కమ్ముకుంది. పెద్ద పెద్ద చెట్లు ఆ చీకట్లో భయంకరంగా కనిపిస్తున్నాయి.

బాస్, అతడు లోపలికెళ్లి కూర్చున్నారు. మేము కొద్దిసేపు బయట పచార్లు చేశాము. చుట్టుపక్కల ఎక్కడా ఇళ్లు కానీ, మనుషుల ఉనికి కానీ మాకు కనిపించలేదు.

ఈ రోజు రాత్రి అతడిని ఫినిష్ చేస్తే బావుంటుందని మాలోని ఒక కుర్రాడన్నాడు.

సుమారు పదకొండు గంటలకి అతడు నిద్రపోయాడు. అతడు బాస్‌తోబాటు రూమ్‌లోనే పడుకున్నాడు. మేము బయట హాల్లో పడుకున్నాం. బాస్ రూమ్‌కి బయట నుండి గొళ్లెం పెట్టాం.

నాకు నిద్ర పట్టలేదు. మనస్సు నిండా అతడే ఉన్నాడు. నెలమంగల దాబా హొటల్ దగ్గర కానీ, హాసన్ వదిలిన తర్వాత, పోలీసులు బండి ఆపినప్పుడు కానీ అతడు తప్పించుకోవటానికి అవకాశం ఉన్నప్పటికీ అతడు ఏ మాత్రం అలాంటి ప్రయత్నం చేయలేదు.

అతడు తన చావు గుహలోకి వెళ్లటానికి మనస్సును సిద్ధం చేసినవాడిలా కనిపించసాగాడు.

నేను చదివిన ఒక సంఘటన నన్ను వెంటాడసాగింది.

కాలిఫోర్నియాలో ఒకసారి రెండు పిల్లుల్ని కార్పొరేషన్‌వారు పట్టుకుంటారు. ఆ పిల్లుల్ని గ్యాస్ చాంబర్‌లో పెట్టి చంపటానికి వ్యాన్‌లో పట్టుకెళతారు. అప్పుడు వ్యాన్ నుండి ఒక పిల్లి బయటికి దూకుతుంది. ఇంకో పిల్లి సీరియస్‌గా కూర్చొని ఉంటుంది. తప్పించుకోవటానికి ప్రయత్నించదు. దార్శనీకుడు, ఒక రచయితను అడుగుతాడు.

'ఆ రెండు పిల్లుల్లో నీకు ఏ పిల్లంటే ఇష్టం?'

రచయిత ఇలా జవాబిస్తాడు 'తప్పించుకున్న పిల్లి'.

'కారణం?'

'అది తన చావుకు వ్యతిరేకంగా పోరాడుతుంది. హీ ఈజ్ హీరోయిక్'.

దార్శనీకుడు నవ్వుతూ చెబుతాడు, 'చావును ఎదురించటానికి సిద్ధపడ్డ పిల్లి హీరోయిక్ అయ్యుండవచ్చు. తప్పించుకున్న పిల్లి పిరికిదై ఉండవచ్చు. బహుశా అది ఇంకా దారుణమైన చావు చచ్చుండవచ్చు'.

రచయిత ఒప్పుకోడు.

అంతలోనే తప్పించుకున్న పిల్లి ఒక కారు కింద పడి విలవిల్లాడుతూ మరణిస్తుంది. రచయిత ఉలిక్కిపడతాడు. చావుని ఎదురించటానికి సిద్ధమైన పిల్లి అతడికి గొప్పగా అనిపిస్తోంది.

నా కళ్లకి అతడు చావుని ఎదురించటానికి సిద్ధమైన పిల్లిలా కనిపించసాగాడు. కాకపోతే అతడికి తను చావుకి దగ్గరవుతున్నాడనే ఇంగితం లేదా?

నాకు సుమారు ఒంటిగంట సమయంలో నిద్రపట్టింది.

నేను రాత్రి ఎన్ని గంటలకి పడుకున్నా ఉదయం 5 గంటలకే లేచి వ్యాయామం చేసే అలవాటుంది.

ఫారంలోని బయటి వాతావరణాన్ని రాత్రి గమనించటంవల్ల గది బయట పురుగు–పుట్ర, పాములు, తేళ్లు ఉండవచ్చనే అనుమానంతో ఆరుగంటలకి లేచి బయటికొచ్చాను.

అప్పటికే మసక మసగ్గా వెలుతురు. ఫారం కుడివైపు ఎత్తుగా ఒక మట్టిదిబ్బ ఉంది. అక్కడ పొదవాటి చెట్లున్నాయి. అక్కడికెళ్లి వార్మప్ చేసి శరీరాన్ని తేలిక చేసుకొని, వ్యాయామం మొదలుపెట్టాను.

ఒకసారి ఆ ఇంటివైపు చూసినప్పుడు బాస్ పడుకున్న గది కిటికీ దగ్గర అతడు నిలబడి ఉన్నాడు. నేను చేస్తున్న మూవ్‌మెంట్స్ గమనిస్తూ ఉన్నాడు.

నేను అతడు దగ్గరికెళ్లాను. అతడి వేళ్లమధ్య సిగరెట్ ఉంది. 'గుడ్ మార్నింగ్' అన్నాను.

అతడు పెదాలమీద చూపుడు వేలు పెట్టి బాస్ పడుకున్నారని కళ్లతోనే సైగ చేశాడు.

ఇంత త్వరగా ఎందుకు లేచావని మెల్లిగా అడిగాను. తనకి ఉదయం తొందరగా లేచే అలవాటు ఉందని చెప్పాడు. 'నాకు బయటికి రావాలనిపిస్తోంది, కానీ బయట నుండి గడియ పెట్టారు' అన్నాడు.

తీయమని అతడు అడగలేదు. నేను తీయలేనని అతడికి చెప్పలేదు.

"మీ కిక్కింగ్స్ చాలా సూపర్బ్. ఎన్నేళ్ల నుండి ప్రాక్టీస్ చేస్తున్నారు?"

"పదిహేనేళ్ల నుండి" గర్వంగా చెప్పాను.

"మీరు చేసే కిక్కింగ్స్ చూడటం కళ్లకి ఆనందంగా ఉంది, ఈ రోజైనా చూసే అదృష్టం ఉంది. రేపు చూడలేం కదా?"

నా కళ్లల్లోకి కళ్లుపెట్టి చెప్పిన ఆ మాటలు అంతటి చలిలోనూ నాలో విషాదాన్ని రేకెత్తించాయి. మాట్లాడకుండా అతడి కళ్లవైపే చూడసాగాను. లోతైన, దీర్ఘమైన నిశ్శబ్దం మా ఇద్దరి మధ్య ఉంది.

ఆ రోజు ఆదివారం. ఫారంలో అది వేరే రోజైతే పెద్దగా తేడా కనిపించేది కాదు.

నాకు ఆ రోజు ఆదివారమని జ్ఞాపకం ఉండటానికి ఒక బలమైన కారణముంది. చాలా ఏళ్ల నుండి ఆదివారం 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో వచ్చే చెస్ సమస్యని చూసి సాల్వ్ చేయకపోతే నాకు నిద్రపట్టేది కాదు.

ఆ రోజూ అంతే, ఉదయమే సకలేశపురానికి వెళ్లిన బాస్ అనుచరుడికి ఆ న్యూస్‌పేపర్ తెమ్మని చెప్పాను. కానీ అది దొరకలేదు.

పది గంటల సమయంలో అందరం బ్రేక్‌ఫాస్ట్ ముగించాం. ఆ ఫారంలో పందాలకి సిద్ధంగా ఉన్న నాలుగైదు పుంజు కోళ్లున్నాయి. నేనెప్పుడూ కోళ్ల పందేలని చూడలేదు. బాస్‌కి అన్ని రకాల పందాలలో విపరీతమైన ఆసక్తి. కోళ్ల పందాలంటే బాగా ఇష్టం.

రెండుకోళ్లకి పదునైన కత్తుల్ని కట్టి కొట్లాటకి వదిలారు. మాకు కోళ్లంటే తత్సారం. అవి అత్యంత బలహీన మరియు నికృష్ట జీవులని భావన. కానీ వాటి పొట్లాట చూసినప్పుడు కచ్చితంగా ఆ అభిప్రాయం మారుతుంది. చావు చివరి క్షణం వరకూ అది పోరాడుతుంది. వాటి పంతం, కోపం, రోషం మామూలు విషయం కాదు.

పుంజుకోళ్లు పోరాడుతుంటే బాస్ చాలా ఎమోషనల్‌గా ఇన్వాల్వ్ అయ్యాడు. కిందపడ్డ పందెం పుంజుని ప్రోత్సాహించేవాడు. రెండు పుంజులు విపరీతంగా గాయపడి రక్తం ఒరుస్తున్నాయి. ఒకటి అక్కడికక్కడే ప్రాణం వదిలింది. దాన్ని వండుకోవటానికి తీసుకెళ్లారు.

బాస్ 'మనకెందుకింత ఫైటింగ్ స్పిరిట్ అని మీకు అర్థమైందా? ఈ పందాల్ని మనం చిన్నప్పటినుండి చూస్తూ పెరిగాం. మాకు ఎంత బాధనిపించినా చివరి వరకు వదలం' అని చెప్పాడు.

పదకొండు గంటల తర్వాత బాస్ మంగళూరుకి వెళ్తానని బయలుదేరాడు.

ఆ రోజు రాత్రి అతడిని ముగించాలని నిర్ధారించాం. అతడిని 'మిస్సింగ్' చేసి ఏ రకమైన సాక్ష్యాలు లేకుండా చేయటానికి బాస్ ప్లాన్ చేశాడు. దానికోసం ఎంచుకున్న స్థలం, చేసుకున్న తయారీ గురించి నాకు వివరించి, మొత్తం ప్లాన్‌ని ఒకసారి నన్ను చూడమని ఏవైనా పొరపాట్లుంటే తెలుపమన్నాడు.

వెళ్లటానికి ముందు అందర్నీ పిలిచి 'అతడి'తో ఎవరూ ఎక్కువగా మాట్లాడ కూడదని, అలాంటిదేమైనా ఉంటే కేవలం నేను మాత్రం వ్యవహరించాలని చెప్పాడు.

మేము మొత్తం ఆరుగురం ఉన్నాం, అతడితోకాక. అందరం కార్డ్స్ ఆడుతూ కూర్చున్నాం. మిగతా ఇద్దరికి ఆడటం రాదు. వాళ్లిద్దరూ బయట పచార్లు చేయసాగారు.

రెండు వందల యాభై పాయింట్ల సిండికేట్.

మూడు ఆటలాడాం. మూడుసార్లు అతడే గెలిచాడు. ఐదొందల రూపాయల సిండికేట్. మొత్తం ఆరువేలు గెలిచాడు. ఆటకి కూర్చోవటానికి ముందు మేము

అతడినే గెలిపించాలని నిశ్చయించాం. అందులోనూ అతడు కూడా బాగా ఆడుతున్నాడు. అయినా ఆ అదృష్టపు ఆటలో పేకముక్కలు పడుతున్నప్పటికీ మేమే అతడిని గెలిపించేలా చేశాం. మూడు ఆటల తర్వాత ఆట నిలిపివేశాం.

అతడిని, నన్ను గదిలో వదిలి మిగతావాళ్లు బయటికెళ్లారు. చాపమీద గోడకు ఆనుకొని ఇద్దరం కూర్చొని ఉన్నాం. అతడు ముక్కల్ని ఒక్కడే సర్వ్ చేసుకుంటూ ఆడుతున్నాడు. నేను అతడి కదలికలని విషాదంతో చూస్తున్నాను. అతడు తల ఎత్తకుండా అడిగాడు.

'మీరెందుకు నన్ను గెలిపించారు?'

నేను నిజంగా షాకయ్యాను. ఏమని సమాధానం చెప్పాలి?

'లేదు. కార్డ్స్ పడ్డాయి. మీరు గెలిచారు. ఓడిపోవటానికిఎవరిష్టపడతారు?' అతడు చిన్నగా నవ్వాడు.

'మనం ఓడిపోవటం వల్ల బాగా లాభమవుతుందని తెలిసినప్పుడు ఓడిపోవటం సహజం కదా?'

'అంటే?'

'చూడండి, నేను పాయింట్లని కౌంట్ చేస్తున్నప్పుడు గమనించాను. నేను వదిలేసిన కార్డు మీకు కావల్సినప్పటికీ మీరు తీసుకోలేదు.'

నేను అనవసరంగా మాటలు కొనసాగించక అతడినే చూడసాగాను.

ఒకటి రెండుసార్లు ఏదో చెప్పడానికి ప్రయత్నించి విఫలమై, తర్వాత చాలా మామూలుగా అడిగాడు.

'రాత్రే నన్నెందుకు ఫినిష్ చేయలేదు?'

నేను ఏమీ అర్థం కానివాడిలా అతడి ముఖాన్ని చూశాను. నా గుండె వేగంగా కొట్టుకోసాగింది.

'కమాన్, నన్ను చంపుతారని నాకు తెలుసు. కానీ ఎందుకు ఆలస్యం చేస్తున్నారనేది అర్థం కావట్లేదు?'

నేను అమాయకుణ్నేం కాదు. అలా చూస్తే ఈపాటికి కొన్ని హత్యల బాధ్యత నా భుజాల మీదుంది. కానీ ఎప్పుడూ ఇలా జరగలేదు. ఏ వ్యక్తికైనా అర్ధగంట ముందు తన హత్య జరగబోతుందని తెలిసే అవకాశం లేదు. కానీ ఈ వ్యక్తి?

'చూడండి, మీరు నమ్ముతారో లేదో తెలియదు. నాతో ఎప్పుడూ బాస్ మిమ్మల్ని అంతం చేసే విషయం గురించి చర్చించలేదు.'

'బాస్ కేవలం మీ ఒక్కరితోనే ఓపెన్‌గా మాట్లాడేది. కానీ మీరు నిజం చెప్పటానికి ఇష్టపడటం లేదు' అని చాలా దృఢంగా పలికాడు.

నాలో ఎన్నో ప్రశ్నలు ఉద్భవించసాగాయి. 'తను హత్యకాగలడని తెలిసి కూడా ఇతడు తప్పించుకుపోవటానికి ఎందుకు ప్రయత్నించటం లేదు? రక్షించమని ఎవరి కాళ్లూ పట్టుకోవటం లేదు?'

'మీకు ఆశ్చర్యం కలగట్లేదా? నిన్న పోలీస్ మిమ్మల్ని ఆపినప్పుడు నేను అరుస్తూ గొడవ చేసుండవచ్చు. అలా చేస్తే నేను పిరికివాడ్నవుతాను. మీనుండి తప్పించుకున్నా నేను పోలీసుల నుండి తప్పించుకోలేకపోయేవాణ్ని. నామీద చాలా హత్యకేసులు ఉన్నాయి. అక్కడి పోలీసులు నన్ను ఎన్‌కౌంటర్ చేసేవాళ్లు. వారి చేతుల్లో దెబ్బలు తింటూ, మిగతావారి పేర్లు చెబుతూ చావటం కన్నా మీలాంటివారి చేతుల్లో చావటం మంచిది కదా.'

అతడి మాటల్లో నాకు నమ్మకం కలగలేదు. ఏ జంతువైనా కానీ చావు దగ్గరికొచ్చినప్పుడు తెగించి పోరాడుతుంది. అతడు నేరస్థుల ప్రపంచంలో బాగా పరిణితి చెందినవాడు. విసిరే కఁర నుండి తప్పించుకున్న తర్వాత ఏదైనా జరుగవచ్చుననే సామాన్యమైన ఇంగిత జ్ఞానం అతడికి ఉండాలి. బహుశా నా నోటి నుండి అతడు తన చావు విషయాన్ని తెలుసుకోవాలని ప్రయత్నిస్తుండవచ్చు లేక నా నుండి తనపై జాలి కలిగేలా చేసి, ఇక్కడినుండి తప్పించుకునే ఆలోచన చేస్తుండవచ్చనే అనుమానం నాలో కలగసాగింది.

నేను కచ్చితమైన గొంతుతో చెప్పాను. 'చూడండి మీరు చెప్పేది, మీరు మాట్లాడేది రెండూ అర్థం లేని విషయాలు. మిమ్మల్ని ఖతం చేయాలని ఉంటే బెంగుళూరులో అవకాశం దొరకదా? ఇంత దూరం వచ్చి, రోడ్డుమీద మిమ్మల్ని బండిలో తీసుకెళ్లి రిస్క్ తీసుకొని వచ్చేవాళ్లమా? బెంగుళూరులోనే మిమ్మల్ని కొట్టి పడేస్తే ఎవరు కంప్లయింట్ ఇస్తారు. అన్ ఐడెంటిఫైడ్ బాడీ అని పోలీసులు రికార్డ్ చేస్తారు'.

అతడు నిస్తేజంగా నవ్వసాగాడు.

'మీరు లాజిక్ ద్వారా నానోరు మూయించారు. కానీ నిజం మనిద్దరికీ తెలుసు. ఎనీ వే మీరు స్వతంత్రులు. నేను ఫోర్స్ చేయను. నేను ఈ రాత్రి కచ్చితంగా చచ్చిపోతానని నాకు తెలుసు.

'నేను ఈ విషయం ఎందుకు అడుగుతున్నాను అంటే, మీరు ఒప్పుకున్నట్లయితే, నేను కొన్ని పర్సనల్ విషయాలని మీతో చెప్పుకోవాలి.'

నాకు ఏం చెప్పాలో తెలియలేదు. నేనెంత జాగ్రత్తగా మాట్లాడినా, ఏ మాత్రం చనువు ఇచ్చినా అతడు మా ఉద్దేశాల్ని అర్థం చేసుకుంటాడు. కానీ ఇంకా పది

గంటల కన్నా ఎక్కువకాలం బతకలేని మనిషి కోరిక, బాధల్ని తెలుసుకోవాలనే ఆసక్తి నాలో పెరగసాగింది.

'చూడండి, నాకు తెలిసినంతవరకు మీకేం జరగదు. కానీ నేను బాస్‌ని కాను. నిర్ణయం తీసుకోవల్సిన బాధ్యత, హక్కు అతడికి మాత్రం ఉంది. అదీకాకుండా జీవితం గురించి ఎవరు గ్యారంటి ఇవ్వగలరు? రేపు మనం ఏ యాక్సిడెంట్‌లోనో మరణించవచ్చు కదా? బతికుంటే మనం ఏదైనా సాధించగలం. బట్ కెన్ వుయ్ ప్రివెంట్ డెత్? నేను ఎప్పుడైనా చావగలను అనుకుంటూ ఏం చెప్పాలనిపిస్తే దాన్ని చెప్పండి.'

అతడు నవ్వాడు. పెద్దగా నవ్వాడు.

'చివరికైనా ఒప్పుకున్నారు మీరు. ఎవరూ దాన్ని, అంటే ఈరోజు నా చావుని తప్పించటానికి సాధ్యపడదు. అది నా విధి. ఇప్పుడు భోంచేద్దాం. తర్వాత మీరు నాకోపని చేసి పెట్టాలి. నో.. నో.. నన్ను బతికించమని కాదు. వేరే పర్సనల్ పని. చెయ్యటం, చెయ్యకపోవటం మీ ఇష్టం.'

అందరూ భోజనం చేశాం. అతడు బాగానే భోంచేశాడు.

'చాలా అద్భుతంగా ఉంది' అంటూ ఫిష్ ఫ్రై పొగిడాడు. నాకు భోజనం రుచించలేదు. అతడినెందుకు ఇక్కడి నుండి ఎస్కేప్ చేయకూడదు అనే ఆలోచన మెదడులో రాసాగింది.

బాస్ కుర్రాళ్లలో నాకు బాగా నమ్మకం ఉన్న కుర్రాణ్ని పక్కకి తీసుకెళ్లి, అతడితో నాకెందుకో అతడిని చంపటానికి మనసొప్పటం లేదన్నాను. ఆ కుర్రాడు 'ఉలిక్కిపడి బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోండి. తొందర పడకండి' అన్నాడు.

అతడు చెప్పిన మరో సంగతి నన్ను ఆందోళనకి గురిచేసింది. ఆ కుర్రాడు 'అతడి' గురించి బాధ్యతాదాయకంగా ప్రవర్తించమని హెచ్చరించాడు.

'అతడిని సులభంగా ఎస్కేప్ చేయవచ్చు. తర్వాత ఏమవుతుందో ఆలోచించారా? అతడు బెంగుళూరుకి చెందినవాడు కాదు. ముంబై మనిషి. ఆ రోజు కాకపోతే రేపు మీరు సపోర్ట్ చేసి బచావ్ చేయించారని చెప్పుకు తిరిగితే... తర్వాత ఏం చేస్తారు?'

అతడిని ఎస్కేప్ చేయించాలనే తపన నాలో మొలకెత్తసాగినప్పుడు ఈ కుర్రాడు నాలో చీకటి ప్రపంచపు నియమాలను గుర్తు చేయసాగాడు.

'మీకు బాగా కావల్సిన మనిషిని మిస్సింగ్ చేయటానికి ప్రయత్నిస్తే, దానికో అర్థముండేది. కానీ మీకు ఏమాత్రం సంబంధం లేని ముంబై మనిషిని నన్ను ఫినిష్ చేయటానికి సిద్ధమైనప్పుడు మీరు ఈ పని చేయటం సరైనదా అని బాస్

అడిగినప్పుడు ఏమని జవాబు చెబుతారు? కావాలంటే అతడిని ఫినిష్ చెయ్యవద్దని బాస్‌కు ఒక్క మాట చెప్పిచూడండి. ఎస్కేప్ చేయించే ఆలోచన వద్దు.'

ఇంటి నుంచి కొంచెం దూరంలో మేమిద్దరం చెట్టు కింద నిలబడి మాట్లాడుతున్నాం. ఇంటి ముందు కూర్చొని అతడు మమ్మల్ని గమనిస్తున్నాడు.

అప్పటికే సాయంత్రం నాలుగైంది. బాస్ ఏడుగంటలకొస్తానని చెప్పాడు. తర్వాత మహా అంటే పది గంటలలోపు ఈ పనైపోతుంది. సరిగ్గా లెక్కపెడితే ఆరేడు గంటలు పడుతుంది బాస్ రావటానికి. ఏవైనా కబుర్లు చెప్పుకుంటూ మూడు గంటలు గడిపేయాలని నిర్ణయించాను.

బాస్ కుర్రాళ్లు మాచుట్టూ తిరుగుతున్నారు. కానీ వాళ్లు అంతగా అప్రమత్తంగా ఉన్నట్లు కనిపించలేదు. ఆ బాధ్యత అంతా నాదే అన్నట్లు హాయిగా ఉన్నారు.

నేను అతడి దగ్గరికెళ్లాను. అతడి దగ్గర సిగరెట్స్ ఖాళీ అయ్యాయి. 'ఒక ప్యాకెట్ తెప్పించగలరా?' వినయంగా అడిగాడు.

బాస్ కుర్రాళ్ల దగ్గర సిగరెట్ ప్యాకెట్లున్నాయి. ఒక కుర్రాడి దగ్గరి నుండి సిగరెట్ ప్యాకెట్ తీసిచ్చాను. అందులో ఐదారు సిగరెట్లున్నాయి. ఒక సిగరెట్ తీసి వెలిగించాడు. నిదానంగా పొగ వదులుతూ నా ముఖం వైపు చూస్తూ మాట్లాడసాగాడు.

'చూడండి, మీరు లేకుంటే ఈ రోజు చాలా బోర్ కొట్టేది. టైమ్‌పాస్ అయ్యేది కాదు. నిజంగా నేను లక్కీ. మీరు దగ్గరున్నారు, కాబట్టి ఏదో చెప్పాలనిపిస్తోంది. మొత్తం చెప్పేస్తాను. రేపటి నుండి ఏం చెప్పటానికి కుదరదు?'

'మొత్తానికి మీరు నిర్ధారించారన్నమాట. ఈరోజు రాత్రి మిమ్మల్ని ఫినిష్ చేస్తారని!'

'నేను నిర్ధారించలేదు. ఇది నిర్ధారించే సంగతి కాదు. నాకు కచ్చితంగా తెలుసు.'

ఈ మాటలని విని నాకు కొంచెం అసౌకర్యంగా అనిపించసాగింది. అతడు మహావేదాంతిలా మాట్లాడటం వల్ల అలా అనిపించిందో, లేక అతడు అలా చెప్పటం వల్ల నేనేం చెయ్యలేక పోయాననే అసహనం వల్ల అలా అయిందో చెప్పలేకపోయాను.

నా ఉద్దేశం స్పష్టంగా అర్థమయ్యేటట్లు అతడితో చెప్పాను. 'చూడండి... ఇలా మాటిమాటికి చెప్పడం వల్ల ఏం ప్రయోజనం లేదు. ఒకవేళ మిమ్మల్ని చంపాలనిపిస్తే కచ్చితంగా చంపుతాం. కానీ ఈ విషయంలో నాకేం తెలియదు. దాన్ని నేను సమర్థించలేను. వేరే ఏదైనా విషయం మాట్లాడుదాం.'

అతడు పెదాల్ని ఒత్తిపెట్టి పెద్దగా నవ్వసాగాడు. తర్వాత మౌనంగా సిగరెట్ పొగమీద గమనాన్ని కేంద్రీకరించాడు. నిదానంగా నిట్టూర్చాడు.

"మీరు చెప్పింది కరెక్ట్. కానీ తన చావు గురించి తెలిసిన మనిషికి వేరే ఆలోచన రాదు. కనీసం తన మనస్సులో ఉన్నది చెప్పుకోవాలి అనిపిస్తుంది. మీ స్థానంలో ఎన్నోసార్లు నేనూ ఉన్నాను. అప్పుడు నాకు ఎదుటివారి భావాలు అర్థం కాలేదు."

'నేను సిగ్గుతో కుచించుకుపోతున్నాను. అతడిని ఓదార్చే బదులుగా అతడిలో దు:ఖాన్ని కలిగిస్తున్నానే భావన నన్ను నిలువునా దహించసాగింది.

'మీకు ఏం చెప్పాలనిపిస్తుందో మనస్ఫూర్తిగా చెప్పండి'

అతడు కొంచెంసేపు నిశ్శబ్దంగా ఉన్నాడు, 'మిమ్మల్ని చూస్తే, ఈ ఫీల్డ్‌లో ఫిట్ అనిపించరు. మీరు ఎలా ఈ ఫీల్డుకొచ్చారు?'

ఇలాంటి సన్నివేశంలోనూ నాకు నవ్వొచ్చింది. కొద్దిసేపట్లో చావబోయేవాడి గురించి ఆసక్తి చూపుతున్నందుకు!

'మొదటిది నేను మీ లెవెల్ మనిషిని కాదు. రెండోది నేను ప్లాన్‌చేసి ఈ ఫీల్డ్‌కి రాలేదు. జస్ట్ కొన్ని సంఘటనల వల్ల ఈ ఊబిలోకి రావలిసివచ్చింది. అది వదిలెయ్యండి. నాట్ ఇంటరెస్టింగ్. మీ సంగతి చెప్పండి' అన్నాను.

'నేను ఈ ఫీల్డ్‌కి చాలా చిన్న వయస్సులోనే వచ్చాను. నా పన్నెండేళ్ల వయసులో ముంబైకి వెళ్లిపోయాను.'

'మీ అమ్మా నాన్న..'

ఒక్క నిమిషం నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

'ప్లీజ్ వారి సంగతి వద్దు. వాళ్ల దృష్టిలో నేను చాలా ఏళ్ల క్రితం చచ్చిపోయాను. నేను మంగళూరులో ఉండేవాణ్ని' అనే విషయం తప్ప వారితో ఏ సంబంధమూ లేదు. ఒకట్రెండుసార్లు ఊరెళితే ముఖం మీదే తలుపేశారు. నేను ముంబైలో రెండేళ్లు సప్లయర్‌గా ఉన్నాను. అప్పుడు హొటల్‌కి కాలియా ఆంటోని వచ్చేవాడు. అన్నట్లు... మీకు బాంబే అండర్‌వరల్డ్ గురించి ఐడియా ఉందా? కాలియా పేరు విన్నారా?'

'కాలియా గురించి పత్రికల్లో చదివాను. ఒకటి రెండుసార్లు బాస్‌ని చూడటానికి వచ్చాడు. బాంబే కుర్రాళ్లు అతడి గురించి పొగుడుతూ మాట్లాడేవారు.'

'బాంబే అండర్‌వరల్డ్‌లో నిజమైన పులి అతడు. ఎవరికీ తలవంచడు. పెద్ద పెద్ద గుంపులతో చేతులు జోడించలేదు. ఒంటరిగా పెద్ద పెద్ద గ్యాంగ్ లీడర్లను ఫేస్ చేశాడు. హొటల్లో నాకు అతడి పరిచయమైంది. అప్పుడప్పుడు నాలుగు

వందలు, ఐదు వందలు డబ్బులిచ్చేవాడు. నన్ను సప్లయిర్ ఉద్యోగంలోంచి తీసి, తనకి తెలిసిన ఇంట్లో పనికి ఉంచాడు. ఆ ఇంటి యజమాని గుడుంబా దందా నడిపేవాడు. అక్కడ నేను చేతుల నిండా డబ్బులు సంపాదించేవాణ్ని. నాకు అప్పుడే పదిహేనేళ్లు నిండాయి. ఒకసారి టపకాయించటానికి నన్ను తనతో బాటు తీసుకెళ్లాడు.'

నేను నిర్లిప్తంగా వింటున్న తీరు అతనికి అనుమానమొచ్చింది. 'మీకు టపకాయించడం అంటే అర్థం అయిందా?'

నేను ఊరికే తల పంకించాను.

'మా బాంబే భాషలో టపకాయించడం అంటే మర్డర్ చేయడం అని. బాంబే కుర్రాళ్లు 'టప్కానే కేలియే జాతా హై' అంటే ఎవరినో ఫినిష్ చేయటానికి వెళ్తున్నారనే అర్థం.'

'మీరు పదిహేనేళ్లకే ఆ పనికెళ్లారా?' కొంచెం ఆశ్చర్యంతో అడిగాను.

"అవును మీరు ఏ వయసులో హత్య చేశారు?'

నేనెప్పుడూ నేను పాల్గొన్న హత్యల గురించి మాట్లాడ్డానికి ఇష్టపడేవాడ్ని కాదు.

'క్షమించండి. నేను పర్సనల్ లెవల్‌లో మాత్రం పాల్గొన్నాను. మీరు చెప్పే రీతిలో హత్యల్లో పాల్గొనలేదు.'

'మీరు అబద్ధం చెబుతున్నారు?'

'మీకెందుకు అలాంటి డౌట్?'

నన్ను రెచ్చగొట్టే విధంగా చూస్తూ అడిగాడు.

'ఇప్పుడు నన్ను మీరు హత్యచేయటం లేదా? నా గురించి మీకు పర్సనల్ అనేది ఏముంది?'

ఇప్పుడు తడబడటం నావంతయింది.

'చూడండి, ఇప్పుడు మీ హత్య గురించి మాట్లాడ్డం మొదలుపెడితే నాకు చిరాకేస్తుంది. మీ జీవితం చాలా ఇంటరెస్టింగ్‌గా ఉంది. దాని గురించి మాట్లాడదాం' అని నా విస్తుబాటును కప్పిపుచ్చాను.

రెండు నిమిషాలు నిశ్శబ్దంగా ఉండి నిట్టూర్చాడు.

'నేను పాల్గొన్న మొదటి హత్య అంధేరిలో జరిగింది. కాలియా నన్ను చుట్టూ గమనించడానికి రోడ్డు మలుపులో నిలబెట్టాడు. సమయం దాదాపు రాత్రి ఎనిమిది గంటలైంది. నేను నిలబడ్డ చోటు నుంచి రెండు వందల అడుగుల దూరంలో ఒక బంగ్లా ఉంది. మేము ఎదురుచూస్తున్న అరగంటలోపే ఒక కారు వచ్చి గేటుముందు నిలబడి హార్న్ చేసింది. కొన్ని అడుగుల దూరంలో నిలబడ్డ ఇద్దరు కాలియా

కుర్రాళ్లు వడివడిగా నడుచుకుంటూ వచ్చి, అతడితో ఏదో మాట్లాడే తీరులో దగ్గరికెళ్లి షూట్ చేశారు. నేను దీన్నంతా రెప్పార్చకుండా గమనిస్తున్నాను. కేవలం ఒకే నిమిషంలో ఆ వ్యక్తి హత్య చేయబడ్డాడు. ఎవరూ శబ్దం విని దగ్గరికి రాలేదు.

బాగా డబ్బున్నవారి లొకాలిటీ అయినందువల్ల మమ్మల్ని ఎవరూ గమనించలేదు. నేను వెళ్లి కొద్ది దూరంలో ఉన్న కాలియా కారులో కూర్చున్నాను. దారి పొడవునా కాలియా ఏం మాట్లాడలేదు. రాత్రి పది గంటల సమయంలో ఆ ఇద్దరు కుర్రాళ్లు తిరిగొచ్చారు. అంతా అనుకున్నట్లే జరిగింది. కాలియా నాకు పదివేలిచ్చాడు. ఆ రాత్రంతా నాకు నిద్రపట్టలేదు. రాత్రంతా ఆ హత్య, పదివేలు డబ్బు కళ్లముందే కదులుతున్నాయి. హత్య అంటే ఎంతో భయంకరమైన సంగతి అనుకున్న నాకు, అది అంత సులభంగా జరిగిపోతుందని అనుకోలేదు. కాలియాకి నామీద ప్రేమ రెట్టింపయింది. అతడి చుట్టూ ఉన్నవారు నాతో బాగా నమ్మకంతో మాట్లాడసాగారు. ఐదవ తరగతి వరకు చదువుకున్న నేను ఒక మోస్తరుగా ఇంగ్లీష్ మాట్లాడ్డం నేర్చుకున్నాను. హిందీ పుట్టుకతోనే వచ్చేది.'

అతడు మాటలు ఆపి ఆకాశాన్ని చూడసాగాడు. నిన్నటి నుండి అతడు ఆకాశం వైపు ఎక్కువగా చూడడం నేను గమనించాను.

'ఏమిటి అంత ఏకాగ్రతగా ఆకాశాన్ని చూస్తున్నారు?'

'ఊరికే చూడాలనిపిస్తోంది. కారణం అంటూ ఏం లేదు.'

అతడిని చూస్తే చాలా ఇంగ్లీష్ సినిమాలలో ఉరివేసే లేక షూట్ చేసే సందర్భాలలో చావబోయే వ్యక్తి ఆకాశాన్ని చూసే దృశ్యం గుర్తుకొచ్చింది.

అతడు ఏం మాట్లాడలేదు. మూడీగా నేలవైపు చూడసాగాడు. నేనే నిదానంగా అడిగాను – 'తర్వాత మీ చేతుల్తో హత్య చేయటం ఎప్పట్నుంచి ప్రారంభించారు?'

అలా ఊరికే చేత్తో సైగ చేశాడు. ఒక రకమైన దు:ఖం అతనిలో అలజడిని సృష్టించిందని నాకు అర్థమవసాగింది.

'మనిద్దరికీ తెలుసు. హత్య చేయటం గొప్ప ప్రత్యేకమైన శ్రమతో కూడిన పనేం కాదు. మీరు బెంగుళూరులాంటి చోట ఉండటం వల్ల ఎక్కువ హత్యలకి అవకాశం దొరకదు. ముంబైలో వేలకొద్దీ జనం హత్య చేయటాన్ని వృత్తిగా ఎంచుకుని జీవిస్తున్నారు. అక్కడ ఐదువేల నుండి యాభై లక్షల వరకు ఒక్కో తలకి రేటుంటుంది. కానీ ఇందులో స్పెషాలిటీ ఏముంటుంది అంటే వేరే ఉద్యోగాల్లో చేతి నిండా డబ్బు దొరకదు, ఇక్కడ చాలా సులభంగా దొరుకుతుంది. పది అడుగుల దూరంలో నిలబడి ఒక్కడ్ని షూట్ చేస్తే పని అయిపోతుంది. ఫినిష్!'

‘నేను ఈ మాటల్ని ఒప్పుకోను. ఇక్కడ హత్యతో పాటు హంతకుడు కూడా నాశనమయ్యే రిస్క్ ఉంటుంది. అందుకే సగటు మనిషి ఇలాంటి పనిచెయ్యటానికి భయపడతాడు.’

‘లేదు. వాళ్లు భయపడేది దొరికిపోతామని. ఆ భయం లేకపోతే ప్రతి చిన్న చిన్న విషయాలకి హత్య జరిగేవి. అవునా? నేను చాలా మర్డర్లు చేశాను. కానీ వాటిలో రెండు హత్యలు నన్ను విపరీతంగా వెంటాడుతున్నాయి; ఇంకా పది హత్యల్ని చేసినా ఫర్వాలేదు, ఈ రెండు హత్యల్ని మాత్రం నేను చేయకుండా ఉంటే బావుండేది.’

అతడు మాట్లాడ్డం ఆపేశాడు. సాధారణంగా ప్రొఫెషనల్ హంతకులు ఏ ఉద్వేగానికీ లోనవ్వరు. చాలా కఠినంగా ఉంటారు. బహుశా అతను ఏదో అమ్మాయి హత్యనో లేకపోతే చిన్నపాప హత్యనో చేసుండాలి అనిపించింది. హంతకుల ప్రపంచంలో కూడా ఆడవాళ్లు, పిల్లల గురించి దయ, కరుణ ఉంటాయి.

మళ్లీ ఆకాశాన్ని చూడసాగాడు. అక్కడ ఒక రాబందు వలయాకారంలో ఎగురుతూ కనిపించింది. అతడి కళ్లు దాని చలనాన్నే గమనిస్తున్నాయి. అది ఒక్కోసారి కిందకి దిగటానికి ప్రయత్నిస్తూనే మళ్లీ పైకెళ్లి తిరుగుతూ ఉంది.

‘దానికి కింద ఏదో కనిపిస్తోంది. సరైన సమయం కోసం వేచి చూస్తుంది’ అంటూ దాని నుంచి దృష్టి మరల్చకుండానే అతడు అన్నాడు.

అతడి ప్రవర్తన నాకు విచిత్రంగా కనిపించలేదు.

ఇక కొద్ది గంటల్లో తన హత్య జరగబోతుందని కచ్చితంగా తెలిసిన వ్యక్తి ఇంకెలా ప్రవర్తించటానికి సాధ్యపడుతుంది? అతడికి తనవాళ్లు ఎవరు లేరు. తన అంతర్మథనాన్ని తెరచి చూపిస్తున్నది తన హత్యలో పాల్గొనబోయే వ్యక్తికి. అతడు ఎలాగైనా కొద్ది గంటల పాటు కాలక్షేపం చేయాలి. దేని గురించైనా గంభీరంగా మాట్లాడటం అతడి వల్ల సాధ్యపడదని అనిపించసాగింది.

అతడు రాబందుని ఎలా చూస్తున్నాడంటే అతని చివరి రోజు ఉద్దేశమంతా కేవలం ఆ రాబందుని చూడటమే అనిపించసాగింది. ఉన్నట్టుండి ఆ రాబందు తనని చంపటం కోసం కసిగా పైన ఎగురుతున్నట్లు అతడిలో ఒక రకమైన అలజడి మొదలైంది.

ఆ క్షణంలో నాలో చిత్రమైన భావాలు పెల్లుబీకసాగాయి. అతడి స్థానంలో నేనుంటే ఏమై ఉండేది? ఒక్కసారి నా బంధువులందరూ గుర్తుకొచ్చి శరీరం కంపించింది. తప్పించుకోవటానికి ఏమాత్రం అవకాశం లేనప్పుడు బహుశా నేను కూడా ఇలాగే ప్రవర్తించేవాణ్నేమో? దీన్ని ఎలా చెప్పాలి? అనవసరంగా అతడిని

ఈ ఫారంకి తీసుకువచ్చి చాంతాడు వంటి ఐడియాలతో ఇతడిని చంపబోయినందుకు బాస్ మీద విసుగేసింది. బెంగుళూరులోనే ఇతడిని ఫినిష్ చేసుంటే ఏ సమస్య ఉండేది కాదు. కానీ బాస్ పిరికివాడు. ఎప్పటికైనా కేసు బయటపడుతుందేమోనని భయం అతడికి. అంతగా భయపడేవాడు నేర ప్రపంచంలోకి రాకుండా ఉండాల్సిందనిపించింది.

అతడిని చంపటం కన్నా, అతడికి తను హత్య కాబోయే విషయం తెలిసినప్పుడు మేము ఆలస్యం చేయటం నిర్దయగా, క్రూరంగా మమ్మల్ని వెంటాడసాగింది.

ఎగురుతున్న రాబందు రయ్యిన కిందికి వాలి, దేన్నో కాళ్లతో పట్టుకొని పైకెగిరిపోయింది.

అతడు రిలాక్స్ అయ్యాడు.

'మిమ్మల్ని వెంటాడే రెండు హత్యల గురించి చెప్పారు' నేను గుర్తుచేశాను.

'అవును, ఆ రెండు హత్యల్ని నేను ఏ కారణంతోనూ చేయకుండా ఉండాల్సింది. నాకు దాని నుండి విముక్తి లేదు. నేను చచ్చిన తర్వాత కూడా అది నన్ను బాధిస్తుంటాయి' అంటూ ఒక సిగరెట్ వెలిగించాడు.

మళ్లీ చెప్పసాగాడు.

'చూడండి, నా పదిహేనేళ్ల నేర ప్రపంచపు అనుభవంలో రెండు హత్యల్ని నేను చేయకూడనివి. వాటిలో ఒకటి ఒక ముసలమ్మది.'

కొంచెంసేపు నిశ్శబ్దంగా ఉండిపోయాడు. అతడికి సంఘటనల్ని చెప్పటంతో బాటు కొన్ని గంటల పాటు కాలయాపన చేయాలి. అప్పటికే ఆరు గంటలైంది. సాయంత్రపు నీరెండలో ఫారం అద్భుతంగా కనిపిస్తోంది. మేమిద్దరం ఇంటి పక్క నిదానంగా నడుస్తూ మాట్లాడుతున్నాం.

అతడు మళ్లీ కొనసాగించాడు.

'అప్పటికే నేను రెండు హత్యల్ని చేశాను. రెండుసార్లూ రివాల్వర్‌తోనే షూట్ చేశాను. కానీ ఒక్కసారి కాలియా ఒక స్త్రీని హత్య చేయమని చెప్పినప్పుడు నాకేం పాలుపోలేదు. నేను వయసులో చిన్నవాడినైనప్పటికీ కాంట్రాక్ట్ కిల్లర్ల మనోభావాన్ని అర్థం చేసుకున్నాను. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆడవాళ్లని, చిన్నపిల్లల్ని హత్య చేయకూడదని!

'నా ముఖకవళికల్ని చూసి కాలియాకి కొంచెం అర్థమైనట్లుంది. నాకు కొన్ని ఉదాహరణలు చెప్పటానికి ప్రయత్నించాడు. హత్య చేయబోయే వ్యక్తి ఒక విషయం గమనించాలి. హత్య వల్ల ఎవరికి ప్రయోజనమవుతుంది, దానితో మనకేం లాభమని! మిగతాదంతా సర్దుకుపోవాల'ని చెప్పాడు.

'నాకు ఆ పని ఇష్టం లేనప్పటికీ రెండు కారణాలతో ఒప్పుకోవలసి వచ్చింది. ఒకటి కాలియాకి నా మీద నమ్మకం పోతుందనే ఆందోళన, మరొకటి చేతినిండా దొరికే డబ్బుని వదులుకోవటానికి నేను సిద్ధంగా లేను. హత్య చేయబోయేముందు ఆవిడ గురించి ఫీల్డింగ్ చేయటానికి ఒక కుర్రాణ్ని పరిచయం చేశాడు కాలియా. ఆ కుర్రాడికి పెద్దగా వయసు లేదు. బహుశా నా వయసే అనుకుంటాను.'

'ఆ కుర్రాడు నేరుగా ఇంటికి పిలుచుకెళ్లి ఆవిడని పరిచయం చేశాడు. కాలియా చెప్పినట్లు ఆవిడ స్త్రీ కాదు, ముసలమ్మ. దాదాపు అరవైయేళ్ళ కన్నా ఎక్కువే వయసుంటుంది. నేను ఆవిడని చూసినప్పుడు అనుకోకుండా నాకు అమ్మ గుర్తుకొచ్చింది. చిన్న వయసులోనే నేను ఇల్లు విడిచిపెట్టినప్పటికీ, అప్పుడప్పుడు నా కళ్లముందు కదిలేది కేవలం అమ్మ రూపం మాత్రమే. ఆ ముసలమ్మని చూసినప్పుడు అమ్మ లక్షణాలన్నీ కనిపించాయి. అదీకాక ఆవిడ నన్ను ప్రేమతో బేటా అని కూడా సంబోధించింది. తినడానికి బిస్కెట్లు, టీ ఇచ్చింది. ఎంత వద్దన్నా తినమని బలవంతం చేసింది. నన్ను పిలుచుకు వెళ్లిన వ్యక్తి ఆవిడని బడిమా అని పిలిచేవాడు.

ఇంటి నుండి బయటకి వచ్చేలోపల ఆ కుర్రాడు నిజంగా బాగా దగ్గరయ్యాడు. అతడిని దగ్గరున్న పబ్‌కి తీసికెళ్లి మెల్లగా ఆవిడ గురించి ఆరా తీశాను. సాధారణంగా భాయ్ చెప్పినప్పుడు, మేము అలా వివరాలు సేకరించకూడదని నియమం ఉన్నప్పటికీ, ఆసక్తి చంపుకోలేక అడిగాను.

'ఆవిడ ఆ కుర్రాడి తండ్రి మొదటి భార్య. పిల్లలు కలగలేదనే కారణంతో తండ్రి రెండోపెళ్లి చేసుకున్నాడు. అతడికి చాలామంది అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లున్నారు. మొదటి భార్యకి పిల్లలు కలగలేదనే కారణం వల్లనో లేక మరే కారణం వల్లనో అతడు రెండో భార్య నుండి ఎనిమిది మంది పిల్లల్ని పొందాడు.'

'అతడు సినిమా నిర్మాత అయినందువల్ల ఆస్తి బాగానే సంపాదించాడు. సంపాదించిన ఆస్తిని తన ఇద్దరు భార్యలకి సమంగా పంచాడు. కానీ రెండో భార్య, పిల్లలకి ఒంటరిగా ఉండే మొదటి భార్యకు సమంగా ఆస్తి ఇవ్వటం ఇష్టం లేదు. కాకపోతే ఆవిడ చనిపోతే ఆ ఆస్తి కూడా తమకే చెందుతుందనే ఆశతో ఉన్నారు.'

'ఆయన చనిపోయి ఆర్నెల్లయింది. కానీ బడిమా వీరికి ఆస్తినిచ్చే మాట అస్సలు ఎత్తేది కాదు. కాకపోతే పూణేలోని ఆవిడ తమ్ముడు అప్పుడప్పుడు ఆ ఇంటికొచ్చి ఆవిడతో ఉండేవాడు.

'ఒక బిల్డర్ వారి ఆస్తికి మంచి ఆఫర్ ఇచ్చాడు. అందరూ వచ్చి ఆవిడతో మాట్లాడారు. తాను చచ్చేంతవరకు ఆస్తిని అమ్మదల్చుకోలేదని స్పష్టంగా చెప్పింది'.

'మరో సంగతి వీరి చెవిన పడింది. ఆవిడ తమ్ముడు వేరొక బిల్డర్‌కి తమ ఆస్తిని అమ్మటానికి సిద్ధపడ్డాడని. ఆ బిల్డర్‌తో కాలియాకి పరిచయం ఉంది. తను సెటిల్ చేస్తానని కాలియా డీల్ ఒప్పుకొన్నాడు.'

'నేను అందుకు ముసలమ్మని చంపటానికి బదులుగా బెదిరించి, లేక ఏదైనా ఆశ చూపెట్టి ఆవిడ నుండి ఆస్తిని రాయించుకుందామని అంటే, అతడు కుదరదని అన్నాడు. బాగా వయసైనందువల్ల ఆవిడ ఇలాంటివి ఒప్పుకోదని చెప్పాడు.'

'ఆవిడని చూసొచ్చిన రాత్రి నాకు నిద్ర పట్టలేదు. రాత్రంతా నన్ను క్షమించమని దేవుణ్ని ప్రార్థిస్తూనే ఉన్నాను.'

'మరుసటి రోజు నుండి ఆవిడని ఎప్పుడు సాధ్యపడుతుందో అప్పుడు ఫినిష్ చేయాలి.'

'కాలియా నాకు ఈ హత్యలో అస్సలు ఏ రకమైన వెపన్ ఉపయోగించకూడదని చెప్పాడు. ఆవిడని గొంతు నొక్కి చంపి, తర్వాత గ్యాస్ స్టౌవ్ ఆన్ చేసి రమ్మన్నాడు. అరగంట తర్వాత వెళ్లి బయట దూరంగా నిలబడి కిటికీ నుండి అగ్గిపుల్ల గీసి విసిరెయ్యమన్నాడు.'

హత్య చేయటం కన్నా ముఖ్యంగా గ్యాస్ లీక్ చేయటం వైపు దృష్టి సారించాలని, గ్యాస్ లీక్ చాలా ముఖ్యమని కాలియా చెప్పాడు.

పొరపాటున సిలిండర్ పేలకపోతే హత్య సంగతి బయటపడే అవకాశాలున్నాయి. అప్పుడు ఆస్తి సమస్య ఇంకా జటిలమవుతుంది. దానితోబాటు హత్య ఉచ్చు కాలియా చుట్టూ బిగుసుకునే అవకాశం ఉంది.

'ఆ పని నేనొక్కడినే నిలబడి చేయవలసి వచ్చింది. రెండవసారి ఆ కుర్రాడితో ఏదైనా మాట్లాడే సాకుతో వెళ్లి పని పూర్తి చేయాలి. ఆ కుర్రాడంటే ఆవిడకి చాలా ప్రేమ. కానీ అతడు, ఆవిడ ఆస్తి మీద కన్నేశాడు. హత్య జరిగే రోజు అతను నాతోబాటున్నాడు. ఇక్కడ ఏమాత్రం తేడా వచ్చినా ఇద్దరూ పట్టుబడే అవకాశం ఉన్నందువల్ల అతడిని వదిలి వెళ్లాల్సి వచ్చింది.

రెండురోజుల తర్వాత సాయంత్రం ఐదుగంటలకి ఆవిడ ఇంటికెళ్లాను. ఇల్లు ఇండిపెండెంట్ కావటం వల్ల పక్కింటివాళ్లు నన్ను గమనించే అవకాశం లేదు. వెళ్లటానికి ముందు ఇంట్లో ఎవరూ వ్యక్తులు లేరని ఆ కుర్రాడి ద్వారా నిర్ధారణ చేసుకున్నాను.

నేను డోర్‌మీద చిన్నగా శబ్దం చేశాను. ఆవిడ కిటికీలోంచి చూసి డోర్ తీసింది.

'రా బేటా' అని లోపలికి పిలిచి కూర్చోమంది. ఆ కుర్రాడు ఇంతలోనే రావచ్చునని చెబుతూ నా గురించి మాట్లాడటం ప్రారంభించింది. అదే నేను చేసిన పొరపాటు. అప్పటికీ నేనింకా కుర్రాణ్ణి కాబట్టి నాకు ఒక విషయం స్ఫురించలేదు. మేము చంపబోయే వ్యక్తితో ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మీయత, చనువు పెంచుకోవటానికి అవకాశం ఇవ్వకూడదు. హంతకుడు కూడా మనిషే కదా? ఆత్మీయత చేతుల్ని బలహీనం చేస్తుంది.'

అతడు అడుగులేస్తూ నా ముఖాన్ని చూడసాగాడు. నేను ఏమిటన్నట్లు చూశాను.

'చూడండి, మీరు కూడా దాన్నే చేస్తున్నారు. కేవలం మీ శత్రువుగా చూసినవారు అప్పుడే ఆత్మీయులయ్యారు. నా హత్య చేసేటప్పుడు మీ చేతులు శక్తిని కోల్పోతాయి. కావాలంటే నన్ను హత్య చేసేటప్పుడు నా మాటల్ని గుర్తు తెచ్చుకోండి.'

శ్రద్ధగా అతడి మాటల్ని వింటున్న నాకు అతడు తన హత్య గురించి మాట్లాడడం నాకు ఒక్కసారిగా చిరాకనిపించింది. అతడి మాటలకి ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వకుండా 'తర్వాతేమైంది?' అని అడిగాను.

అంతలోనే గేట్‌లోకి ఒక కారు వచ్చింది. అది బాస్ కారు కాదు. బాస్ కుర్రాళ్లు ఆ కార్ దగ్గరకెళ్లారు. వారితో పాటు నేనూ వెళ్లాను. అతడూ వెంట వచ్చాడు.

వచ్చిన వ్యక్తి తుళు భాషలో కుర్రాళ్లకి ఏదో చెప్పాడు. అదొక్క విషయంలో బాస్ గ్రూప్‌పై నాకు కోపంగా ఉండేది. తనతోబాటు ఎవరున్నా వారి గురించి ఆలోచించకుండా వాళ్లు తుళు భాషలోనే సంభాషణలు నడిపేవారు.

డ్రైవర్ చెప్పిన మాటలు వింటూనే బాస్ కుర్రాళ్ల ముఖం పాలిపోయింది.

'రండి రండి వెంటనే మంగళూరు వెళ్లాలి. బాస్ మీద అటాక్ జరిగింది' అని నా భుజం పట్టుకుని ఒక కుర్రాడు చెప్పాడు.

అతడి గురించి రాయటం మీరు చదువుతుంటే ఇదంతా ఇంత వేగంగా జరుగుతాయని మీరనుకుంటే అది తప్పు. నేర ప్రపంచం కూడా మిగతా రంగాల్లా నడుస్తుంది. కొన్ని క్షణాలు మాత్రం అక్కడ ఉద్వేగ భరితంగా ఉంటాయి, అంతే. అది ప్రేమ విషయంలోనూ వర్తిస్తుంది. అన్ని రకాల వేటాడ్డం, వెంటాడ్డం, బాధలు, ఇష్టం లాంటి మొనోటనీని ఉత్తుంగానికి తీసుకెళ్లటం, మర్చిపోవటం ఇవన్నీ కేవలం కొన్ని క్షణాలు మాత్రమే కదూ?

మనలో 'నెపం' అనే గుణం లేకపోతే ఎలా ఉంటుందనీ ఆలోచించండి. ఏ సంఘటనలు మనకు నిజం అనిపించవు. గాలి వీచినట్లు జీవితం కూడా మామూలుగా ముగిసేది. కానీ జ్ఞాపకాలతో జీవితాన్ని రికార్డు చేసే శక్తి మన దగ్గరుంది. లేకపోతే అంతా కలలా ఉండేది. రికార్డు చేయటం ద్వారా మనం కలల్ని ఏ కారణం లేకుండానే జరిగిన సంఘటనలని నిజం చేస్తున్నాం. ఘనీకరిస్తున్నాము.

కానీ ఈ రికార్డు చేయటం అనే మనోభిలాష ఎప్పుడు, ఎందుకు కలిగింది? అసలు అక్షరాలు లేని కాలంలో బొమ్మల ద్వారా రికార్డు చేయలనే ఆశ మనిషికి ఎందుకు కలిగింది? ఈ ప్రపంచంలో మంచి, చెడు అని విభేదం పుట్టిందే రికార్డు చేయటం అనేది 'కళ' అనే గుర్తింపు స్థాయికొచ్చినప్పుడే!

ఒక దార్శనీకుడు ఇలా చెబుతాడు – నిన్న రాత్రి కలలో నేనో సీతాకోకచిలుకనయ్యాను. ఎగరడం, మకరందాన్ని సేవించడం... అన్నీ గొప్ప ఆనందం కలిగించాయి. సీతాకోకచిలుకల ప్రపంచపు అన్ని రంగులు, పులకింతలు నాలో బలంగా నాటుకుపోయాయి. ఉదయం మెలుకువ వచ్చింది. ఇప్పుడు నాకు నేను మనిషిని కలగన్న సీతాకోకచిలుకనో, సీతాకోకచిలుకనని కలగన్న మనిషినో అర్థం కాలేదు. నిజంగా నేను ఎవరు? సీతాకోకచిలకనా? మనిషినా? తెలియచేసేవారు ఎవరున్నారు? ఎక్కడున్నారు?

ఆ రోజు బాస్‌మీద అటాక్ అయ్యిందనే వార్త తెలిసినప్పుడు మాకు కలిగిన ఆందోళన ఏమిటంటే 'అతడి' గురించి; 'అతడి'ని మాతోబాటు తీసుకెళ్లాలా వద్దా అని.

మేమంతా కలిసి రెండు నిమిషాలు అతడి గురించి చర్చించాం. ఇక్కడే వదిలి వెళ్లటంకన్నా మాతోబాటు తీసుకెళ్లటం సరైనదనిపించింది.

వెంటనే మంగళూరుకు బయలుదేరాం. బాస్ నర్సింగ్ హోమ్ నుండి డిశ్చార్జ్ అయి, బంధువుల ఇంటికి వెళ్లాడు. అతడికి పెద్దగా దెబ్బలు తగల్లేదు.

జరిగింది చిన్న యాక్సిడెంట్. రోడ్డు అవతల వైపు పార్క్ చేయబడిన వ్యాన్ దగ్గరికెళ్లేటప్పుడు ఉన్నట్టుండి ఒక మోటార్ సైకిల్ వేగంగా వచ్చి బాస్‌ని గుద్దింది. చేతికి చిన్న ఫ్ర్యాక్చర్ అయ్యింది. సడన్‌గా వచ్చి గుద్దిన మోటార్ సైకిల్‌ని చూసినవాళ్లంతా అది అటాక్ అని భావించారు. బండి నడుపుతున్న వ్యక్తి బండిని ఆపకుండా వేగంగా పరారవ్వటం, వారిలో ఎన్నో అనుమానాలకి దారి తీసింది.

అన్నిచోట్లా వార్త గుప్పుమంది.

తర్వాత గుద్దిన కుర్రాడికి తను గుద్దింది బాస్‌నని తెలిసి, బాస్‌కి పరిచయమున్న ఒక వ్యక్తిని పిలుచుకు వచ్చి క్షమాపణలు అడిగాడు.

బాస్ మోచేతికి ప్లాస్టర్ వేశారు.

బాస్ యాక్సిడెంట్ వల్ల కొంచెం కలత చెందాడు. అందరినీ బయటికి పంపించి నన్నొక్కడినే గదిలో కూర్చోపెట్టుకొని తన బాధను పంచుకున్నాడు. బాస్ బాగా గౌరవించే వ్యక్తి ఉడుపిలో ఉన్నాడు. ముంబై చీకటి ప్రపంచంలో బాగా పేరుపొందిన అతడు, ప్రస్తుతం ఉడుపిలో స్థిరపడ్డాడు. అతడు గొప్ప దైవభక్తుడు. ధర్మ బీరుడు. బాస్ అతడికి ఫోన్‌చేసి తనకి యాక్సిడెంట్ జరిగిన విషయం చెప్పినప్పుడు, మీరు చేయబోయే పని సరిగ్గా లేనప్పుడు ఇలాంటివి జరుగుతాయి. అలాంటి పనేదైనా మీరు చేస్తున్నట్లయితే దాన్ని వెంటనే విరమించుకోవాలని సలహా ఇచ్చాడతను.

ఇప్పుడు బాస్ సందిగ్ధంలో పడ్డాడు; 'ఇప్పుడతణ్ని ఫినిష్ చేయాలా? వద్దా?'

'అతడు' ఎలా ప్రవర్తిస్తున్నాడని నన్ను అడిగాడు. నేను అతనికి తనని హత్య చేయబోతున్నారనే సంగతి తెలిసిపోయింది అన్నాను. బాస్ ఒక్క క్షణం కంగారుపడ్డాడు. అతడికి విషయం తెలిసే లోపే ఫినిష్ చేసుండాల్సిందని నొచ్చుకున్నాడు.

నేను 'ఈరోజు రాత్రి ఫినిష్ చేద్దాం' అన్నాను. అప్పుడు రాత్రి పదిగంటలైంది. బాస్ ఈరోజు వద్దని తల అడ్డంగా ఊపాడు. ఈరోజు రాత్రి తను ఇక్కడే ఉండటం వల్ల ఒక్కరోజు పనిని వాయిదా వేద్దాం అన్నాడు. తను లేకపోయినా మేమంతా కలిసి ఆ పని చేస్తామని నేను చెప్పాను. వద్దంటూ బాస్ తన కజిన్ లేకుండా ఆ పని చెయ్యకండి అని వారించాడు.

చివరిగా 'అతడి'ని కొంచెం జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పాడు. నేను అతడితో మాట్లాడినప్పటినుండీ చెప్పుకోలేని విచిత్రమైన వేదన అనుభవిస్తున్నానని చెప్పాను.

బాస్ కొంచెంసేపు గంభీరంగా మారిపోయాడు.

నేల వైపు చూస్తూ తీవ్రంగా ఆలోచనలో లీనమైనట్లు కనిపించసాగాడు.

'నేను అతడి ముఖాన్ని చూడలేకపోతున్నాను. ఈ యాక్సిడెంట్ అయిన తర్వాత మరింత బాధగా ఉంది. మనం చేసిన పనులే కదా అతడు చేసింది? మనం అదృష్టవంతులం. ముందుగా జాగ్రత్తపడ్డాం. అతడు అన్ లక్కీ. మనకు దొరికిపోయాడు. నేను పైవాళ్లతో మాట్లాడకపోతే నాలుగు తగిలించి వదిలిపెట్టేవాళ్లం. ఏం చేద్దాం ఇప్పుడు?'

'మీకు తెలీదు. అక్కడివాళ్లకు మానవత్వం లేదు. అన్నింటికీ ఒకే మాట 'ఉడాదో!' వాళ్లు సరిగ్గా ఉండుంటే నామీద ఈ ప్లాన్ జరిగుండేది కాదు. కాకపోతే

వాళ్లందరూ ఎప్పుడూ సంతోషంగా ఉంటారు. టెన్షన్‌తో చచ్చేది మనమే. ఒకడు ఎవడినో ఫినిష్ చేయటానికి కాపు కాస్తాడు. మరొకడు విషయం తెలిసినా ఊరుకుంటాడు. ఏమాత్రం అటూ ఇటూ అయినా పంపినవారినే లేపెయ్యమని చెబుతారు. నాకూ, మన కుర్రాళ్లందరికీ నిజంగా విసుగేసింది. కానీ ఏంచేద్దాం? వలలో ఇరుక్కున్నాం.'

బాస్ సాధారణంగా ఇలా తను ఉండే పరిస్థితి గురించి ఎప్పుడూ ఎమోషనల్‌గా మాట్లాడడు. తనకి కూడా అతడిని ఫినిష్ చేయటం గురించి ఆందోళనగా ఉంది. కానీ అవసరం అతడిని కట్టిపడేసింది.

మేము మంగళూరులోని ఒక హోటల్లో భోజనం చేసి రాత్రి పదకొండు గంటలకి బయలుదేరాం. భోజనం చేసేటప్పుడు అతడు తల ఎత్తి ఒక్కసారైనా అటూ ఇటూ చూడలేదు. ఆ క్షణంలో నా కళ్లకి అతడు పిరికివాడిలా, బలహీనంగా కనిపించసాగాడు. తను హత్య కాబోతున్నాడని, కచ్చితంగా తెలిసినప్పటికీ ఏమాత్రం తప్పించుకోవటానికి ప్రయత్నించలేని ఇతడు అండర్‌వరల్డ్‌కి రాకుంటే బావుండుననిపించింది.

కానీ అతడి మౌనంలోనూ విచిత్రమైన శక్తి కనిపించేది. పిరికితనపు మౌనం కన్నా తన పరిస్థితిని అర్థం చేసుకున్న యోగిలా కనిపించసాగాడు.

మేము తిరిగి వెళ్లేటప్పటికి రాత్రి ఒంటిగంటైంది.

అతడు, నేను ఒకే గదిలో పడుకున్నాం. కిందటి రాత్రిలా ఆరోజు కూడా బయటి నుండి గడియపెట్టారు.

నాకు నిద్ర ముంచుకొస్తుంది.

కానీ అతడు నన్ను నిద్రపోవటానికి అవకాశం ఇవ్వకుండా అలాగే మాటలు కొనసాగించాడు. మనం నివసించే ప్రపంచపు అనిశ్చితత గురించి చెప్పసాగాడు. బాస్‌కు మైనర్ యాక్సిడెంట్ జరిగినప్పుడు కుర్రాళ్లు ఎలా వేరు వేరు ఆవయావాల గురించి ఆలోచించారన్నది తనదైన రీతిలో విశ్లేషించాడు.

'చూడండి, ఈ ప్రపంచంలోకి లోతుగా వెళ్లేకొద్ది సహజమైన భావాలు, స్పందనలు మరణిస్తాయి. అందరిపై అనుమానం కలగడం మొదలవుతుంది. మీరే ఆలోచించండి. అండర్‌వరల్డ్‌లో హత్యచేయబడ్డవాళ్లందరూ ఒకప్పుడు ఎంతో సన్నిహితంగా, తమ సహచరులుగా ఉన్నవాళ్ల నుండి హత్యచేయబడ్డవాళ్లే!

ఎప్పుడో ఏదో ఒక విషయం గురించి అనుమానం మొదలవుతుంది. తర్వాత ఏం చేసినా ప్యాచప్ కాదు. చివరకు హత్యతో సమాప్తమవుతుంది. ఇక్కడ వాస్తవం ఏమిటంటే ముందు ఎవరు శత్రువవుతారో అని ఎవరికి తెలియదు.'

'మీరు చెప్పేది ఫూలిష్. అది అన్నీ మానవ సంబంధాలకి వర్తిస్తుంది. ప్రేమించి పెళ్లిచేసుకున్నవాళ్లు, డైవోర్స్ తీసుకోరా? ఆలోచించండి. తండ్రి కొడుకులు దూరం కారా? దాన్ని ముందే తెలుసుకోవటం సాధ్యపడదు. అలా ఉండుంటే ప్రపంచంలో ఏ వైరుధ్యాలూ ఉండేవి కావు.'

'మీరు చెప్పేది జనరల్ టాపిక్. కానీ సాధారణంగా అలాంటి సంబంధాలలో ఎక్కడో ఒకచోట మాత్రం హత్యలు కూడా జరుగుతాయి. కానీ మన ఫీల్డులో? హత్యలు చాలా కామన్ కదా?'

నేను విషయం మారుస్తూ 'మీరు సాయంత్రం ముసలమ్మ గురించి చెప్పారు. తర్వాత ఏమైంది?' అడిగాను.

అతడు నిశ్శబ్దంగా సీలింగ్ వైపు చూడసాగాడు. దేని గురించో ఆలోచిస్తున్నట్లుగా కాసేపు కళ్లు మూసుకొని నిదానంగా చెప్పసాగాడు.

'నాకు ఎలాగూ ఒకరోజు అదనంగా దొరికింది. రేపు దాని గురించి మాట్లాడవచ్చు. ఇప్పుడు మరో సంగతి గురించి చెప్పుకోవాలనిపిస్తుంది. ముంబైలో నాకో గర్ల్‌ఫ్రెండ్ ఉంది. నేను తనని మర్చిపోలేకపోతున్నాను. మనం మంగళూరుకి వెళ్లినప్పటినుండి నా గుండెల నిండా తనే ఉంది. నా నుండి తను ఎన్నో కష్టాల్ని ఎదుర్కొంది.'

నాకు ఇతరుల ప్రేమకథల్ని తెలుసుకోవాలన్న ఆసక్తి కానీ, కుతూహలం కానీ పెద్దగా లేదు.

అన్ని ప్రేమకథల్లోనూ అదే బాధ, అవే కన్నీళ్లు, అవే తుళ్లింతలు. ఇక్కడ ఇతడు అండర్‌వరల్డ్‌కి చెందిన వ్యక్తి అయినందువల్ల బహుశా ఇక్కడ వేరే డైమెన్షన్ ఉంటుంది. ఇలాంటి ఘటనలని బెంగుళూరులో నా దగ్గర పనిచేసే కుర్రాళ్ల జీవితాలలో ఎన్నో చూసిన నాకు, అతడు తన స్నేహితురాలి గురించి చెప్పడానికి సిద్ధమైనప్పుడు నేను సానుభూతి చూపించటానికి మౌనంగా ఉండిపోయాను.

కానీ ఈ విషయంలో నేను పెద్దగా ఆసక్తి కనబరచట్లేదని అతడికి అర్థమైంది.

'నాకు అర్థమవుతుంది. ముంబైలో అబ్బాయి–అమ్మాయి ప్రేమించుకోవటం, గొడవపడటం సర్వసాధారణం అని మీకు తెలిసే ఉంటుంది. నాదీ అలాంటి ప్రేమే అని అనుకుంటున్నారు మీరు. కానీ నా జీవితంలో ఏదీ సాఫీగా జరగలేదు. ఇక్కడ కూడా అంతే. ఇంకేం అంతా సవ్యంగా జరిగిపోతుంది అనుకునే సమయానికి, నేను ఇక్కడికి వచ్చి ఇరుక్కుపోయి అన్నింటికీ శుభం చెప్పవలసిన పరిస్థితి వచ్చింది.'

మౌనంగా వింటూ కూర్చున్నాను. నేను ఏం మాట్లాడలేదు.

'నాకు రెండు సంవత్సరాల క్రితం ఒక డిస్కోథెక్ ఇన్‌చార్జ్ దొరికింది. ఆ హొటల్ గురించి మీకు తెలిసే ఉంటుంది. హొటల్ యజమాని తాలూకు ఇద్దరు అన్నగార్లని దుబాయ్‌లో కూర్చునే 'భాయ్' ఫినిష్ చేసారు. ఇక్కడి డిస్కో అంటే మొత్తం ముంబై ఉలిక్కిపడేది. నా చేతికి అధికారం వచ్చిన వెంటనే నేను కాలేజీ అమ్మాయిలు ఈ డిస్కోని వెతుక్కుంటూ వచ్చేలా చేశాను. డిస్కోథెక్ బిజినెస్ నిలబడేది ఇక్కడికొచ్చే ఫ్యామిలీ అమ్మాయిలమీదే. వేరే డిస్కోలలో సాధారణంగా చవక రకం అమ్మాయిలు ఉంటారు. కానీ మా దగ్గరకి మాత్రం ఫ్యామిలీ గర్ల్స్ వచ్చేవారు.'

'రోజూ ఒకే కాలేజీ అమ్మాయిలు రావడానికి కుదరదు. అందుకని నేను అన్ని కాలేజీల ముందు చక్కర్లు కొట్టేవాణ్ని. తర్వాత ముంబై గురించి మీకు తెలిసే ఉంటుంది. అక్కడ అండర్‌వరల్డ్ మనుషులంటే నిజమైన స్టార్స్. ప్రతి కాలేజీలోనూ నాకు చాలామంది కుర్రాళ్లు క్లోజ్‌గా ఉండేవాళ్లు. వాళ్ల ద్వారా నేను అమ్మాయిలని కలిసేవాణ్ని. మీరు చూడాలి ముంబైలో అమ్మాయిలు పాకెట్‌మనీ కోసం ఎలాంటి పాట్లుపడ్తారో అని. అందులోనూ డిస్కో అంటే అమ్మాయిలు బాగా ఎంజాయ్ చేస్తారు. ఖుషీకి ఖుషీ, డబ్బుకి డబ్బులు.'

'ఒక రకంగా మేము చేస్తున్న పని అనైతికం అని మాకు తెలుసు. ముందు ముందు మేమే డబ్బులిచ్చి వారిని అడిక్ట్ చేసేవాళ్లం. తర్వాత వాళ్లే బాయ్‌ఫ్రెండ్స్‌తో మాదగ్గరికి వచ్చేవాళ్లు. మేము వారికోసం వేలల్లో ఖర్చుపెడితే, వారివల్ల మాకు లక్షల్లో ఆదాయం ఉండేది.'

'ఇప్పుడు అదంతా గుర్తు తెచ్చుకుంటే తప్పు చేశామనిపిస్తోంది. కానీ మన స్పీడ్ లైఫ్‌లో ఏది నైతికం, ఏది అనైతికం అని ఆలోచించడానికైనా సమయం ఎక్కడుంటుంది? పక్కవాడి కన్నా వేగంగా దూసుకెళ్లాలనే తపన మాత్రం మనకుంటుంది, ఏమంటారు?'

నాకు ఏం చెప్పడానికి పాలుపోలేదు. నిజం చెప్పాలంటే జీవితంలో మనం ఎన్నుకునే దారిలో నీతి, నియమాలు అవి మన జీవితాన్ని రూపించే విధానం, నాకు ఎంతో ఇష్టమైన సంగతులు. కానీ ఆ క్షణంలో జీవితపు చిట్టచివరి రాత్రిలో ఎప్పుడో చేసిన పాపకృత్యాలని గుర్తుతెచ్చుకుని బయటకు చెప్పుకోవటం ద్వారా గుండె బరువును తగ్గించుకోవాలనే వ్యక్తితో ఇలాంటి తాత్విక చర్చ జరపటం ఒక అబ్సర్డ్‌లా కనిపించసాగింది.

ఎంతో మామూలుగా 'మీరు సరిగ్గా చెప్పారు' అన్నాను.

అతడు మళ్లీ కొనసాగించాడు: 'ముంబైలో నాకు అమ్మాయిల కొదవలేదు. అక్కడి గాలిలో ఉండేది రెండే రెండు వస్తువులు– డబ్బు – అమ్మాయిలు. అందులోనూ డిస్కోథెక్ బాధ్యత తీసుకున్న తర్వాత నేను నిభాయించలేనంత అమ్మాయిలు దగ్గరయ్యారు. చాలా సులభంగా నాకు వాళ్లు దగ్గరవ్వటం వల్ల వారిపై నాకు ఎలాంటి ఫీలింగ్స్ కలిగేవి కావు. కానీ రశ్మీ పరిచయం అయిన తర్వాత అంతా మార్చేసింది.'

కొంచెం సేపు మౌనంగా ఉండిపోయాడు. అతడి మౌనం నాకు అర్థమవసాగింది.

రాత్రి రెండు గంటలైంది. నిద్ర రావట్లేదు. సాధారణంగా నేరం చేయబోయే ముందు రోజు, తర్వాత రోజుల్లో నాకు నిద్ర బాగా పట్టేది. కానీ అతడు నన్ను ఎంతగా ఆవహించుకున్నాడంటే, అతడు తన జీవితాన్నే నాముందు పరుస్తున్నప్పుడు నేను నిద్రపోవటం మహాపాపమనిపించసాగింది.

అతడు సిగరెట్ వెలిగించాడు. ఒక్కసారి దీర్ఘంగా నిట్టూర్చి తన జ్ఞాపకాలని మళ్లీ గుర్తు తెచ్చుకోసాగాడు.

'రశ్మీ డిగ్రీ చదివే అమ్మాయి. తన ఐదారుమంది స్నేహితురాళ్లు డిస్కోకి రావటం మొదలుపెట్టారు. తను మాత్రం అక్కడికి రావటానికి నిరాకరించేది. సాధారణ చామనఛాయతో ఎంతో సహజంగా ఉండే రశ్మీ, తన ముఖంలో మెరిసే కాంతి, అద్భుతమైన కళ్లతో నన్ను ఆకర్షించింది.'

'నేను తన కాలేజీ దగ్గరికి వెళ్లినప్పుడు నన్నో దుష్టుడిలా చూసేది. సాధారణంగా ఏ అమ్మాయినైనా చూడటానికి ఏమాత్రం భయపడని నేను, ఆమెని నేరుగా చూడలేకపోయేవాణ్ని. ఎందుకో నాలో నాకు పాపభీతి కలగటం మొదలయ్యింది.'

'ఒకసారి తన కాలేజీ దగ్గరికెళ్లినప్పుడు తనే వచ్చి పలకరించి క్యాంటీన్‌కి తీసుకెళ్లింది. నేను అమాయకమైన, ఆర్థికంగా స్తోమత లేని అమ్మాయిలను దారితప్పిస్తున్నానని కోప్పడింది. ఒకవేళ నా అక్కచెల్లని ఎవరైనా ఇలా తీసుకెళితే ఏం చేస్తావని ఆలోచించమని చెప్పింది. నేను అలా ఆలోచించటానికి వీలుపడని ఒంటరివాణ్నని తెలిసినప్పుడు ఆమె గొంతు మృదువుగా మారింది.'

'మీరు ఒక విషయం గమనించాలి? చాలా కోపంగా ఉండే అమ్మాయిలు సాధారణంగా ఎంతో మృదువుగా ఉంటారు. కోప్పడని అమ్మాయిలు సాధారణంగా ఎమోషనల్‌గా ఉంటారు. నా రశ్మీ విషయంలోనూ అంతే, వెంటనే కరిగిపోయింది. కుటుంబాన్ని వదిలివచ్చిన నేను పాపపుణ్యాలకి అతీతుడని నిర్ణయించింది. కానీ తను ఊహించినట్లు నేను చేస్తున్న పనుల నుండి బయటికి రావటం సాధ్యపడదని, తన మనసుకి అర్థమయ్యేలా చెప్పాను.

'తను ఒక రకమైన పంతంతో నాకు, నా మనసుకు దగ్గరైంది. నన్ను మార్చటంలోనే తన జీవిత సార్థకత్వం ఉందని చెప్పింది. నాలో మార్చవలసింది ఏం లేదని చెప్పినా ఆమె ఒప్పుకోలేదు. నేను నా సంతోషం కోసమో, పగ కోసమో హత్యల్ని చేయలేదు. నేను చిన్నప్పటి నుండి నాతో ఉన్న మనుషులు హత్య చేయటం డబ్బు సంపాదించే మార్గంగా భావించేవాళ్లు. వాళ్లకి మంచి చెడు గురించిన అవగాహన తెలిసేది కాదు. అందుకే నన్ను మార్చటం సాధ్యం కాని పని అన్నాను'.

'నాకు రశ్మీ పరిచయానికి ముందు చాలామంది బాస్‌ల చేతికింద పనిచేసి ఉన్నాను, ఎక్కడ కూడా నమక్ హరామ్ పనిచేయలేదు. అందుకే ఆ బాస్ నన్ను బాగా ఇష్టపడేవాడు. డిపెండబుల్ అని నిర్ధారించారు. ఇప్పుడు కేవలం ఒక అమ్మాయి కోసం బాస్ నుండి దూరమవ్వటం ఎలా? తర్వాత ఏం చెయ్యాలి?'

'దీన్ని రశ్మీ అంత సులభంగా ఒప్పుకొనేది కాదు. ముంబై వదిలి ఎక్కడికైనా దూరంగా వెళ్లిపోదామని చెప్పేది. ఇక్కడుంటే నేను మారటం సాధ్యపడదని తనకి అర్థమైంది. హైదరాబాద్‌కెళ్లి ఏదైనా బిజినెస్ చేద్దామనేది. కుటుంబపు ఏ బంధాలు లేని నేను ఎప్పుడు కావలిసివస్తే అప్పుడు ముంబైని వదిలిపెట్టడానికి స్వతంత్రుడని వాదించేది.'

'కానీ అది అంత సులభమా? మనం జీవితంలో కమిట్ అయ్యింది కేవలం మన కుటుంబానికి మాత్రం కాదు. మన చుట్టూ మనుషులు, వాతావరణానికి సైతం – అనబడే నిజం తనకి అర్థం కాలేదు.

పడుకొని నావైపు తిరిగి మాట్లాడుతూ లేచి నిలబడ్డాడు. అతడి సంఘర్షణ నాలో విపరీతమైన ఉద్వేగాన్ని కలిగించింది.

కొంచెంసేపు కిటికీ నుండి బయటికి చూశాడు. మరో సిగరెట్ వెలిగించాడు. తర్వాత అక్కడే నిలబడి నావైపు తిరిగి చెప్పసాగాడు.

'ఇంతగా నన్ను మార్చటానికి ప్రయత్నించిన రశ్మీకి ఒక్కరోజు నేను నేర్చుకున్న విద్యనంతా తన కోసం ఉపయోగించాల్సి వస్తుందని కలలో కూడా ఊహించలేదు. ఆ రోజు ఆమె ఎంత బాధపడిందో తెలుసా?'

'మనం మనచుట్టూ చీకటి కోటని నిర్మించుకున్నాం. ఇక్కడ ఎవరూ తమ జీవితపు రహస్యాల్ని, తమలో కలిగే రహస్యమైన ఆశలని, ఆకాంక్షలని, ఆలోచనలని మరొకరితో పంచుకోవటానికి ఇష్టపడరు. ఒకసారి ఆలోచించండి. మీ భార్యకి గానీ, మీ పిల్లలకి గానీ, మీ చుట్టూ ఉన్నవారికి గానీ నిజమైన 'మీరు' ఎంతవరకు తెలుసు?'

ఆ రోజు అతడు ఎవరితోనూ చెప్పుకోలేని సంగతుల్ని నాతో పంచుకుంటున్నాడు. ఇక కేవలం ఒక్కరోజుకే తను లేకుండా పోగలడనే భయం, ఆ ఒక్కరాత్రి తను సజీవంగా ఉండటానికి, నా ఎదుట అతడు తన గుండె తలుపుల్ని తెరవడానికి దోహదపడింది.

అర్ధరాత్రి గాఢ నిశ్శబ్దం, మూడో ఉనికి మామధ్య లేనందువల్ల అతడు పూర్తిగా తనని తాను తెరుచుకోవటానికి ఉపయోగపడింది. సిగరెట్ ముక్కను కిటికీ నుండి బయటకు విసిరేసి నిటారుగా పడుకుని, నుదుటి మీద వేళ్లు ఉంచుకొని, కళ్లు మూసి తనలోని రహస్యాలని చెప్పుకుపోతున్నాడు.

'రశ్మీ మామూలు అమ్మాయి కాదు. మీకు ముందే చెప్పినట్లు ముంబైలో అమ్మాయిలు నాకు చాలా సులభంగా దొరికేవాళ్లు. అలాంటప్పుడు రశ్మీ నన్ను అంతగా ఆకర్షించిందంటే తన వ్యక్తిత్వం ఎలాంటిదో మీరే అర్థం చేసుకోండి. భూతద్దంలో చూసి వెతికినా చిన్న లోపం కూడా కనిపించేది కాదు. బాంబే అమ్మాయిలు ఎప్పుడూ ఏదో చేస్తూ బిజీగా ఉండాలని ఆరాటపడుతుంటారు. కానీ రశ్మీ అలా కాదు. మౌనాన్ని, ఒంటరితనాన్ని బాగా ఇష్టపడేది. బీచ్‌లో చాలాసార్లు దూరం నుండి వచ్చే పడవలని, అలలని చూస్తూ ఉదయం నుండి సాయంత్రం వరకు కూర్చోనేవాళ్లం అంటే మీరు నమ్ముతారా? కొత్తలో అలా ఊరికే కూర్చోవటానికి నాకు సాధ్యపడేది కాదు. అప్పుడు తను నన్ను కోప్పడేది. చిన్నప్పటినుండి నువ్వు యాక్షన్ జీవితానికి అలవాటుపడి మనసంతా పాడు చేసుకున్నావు. ఇప్పుడు దాన్ని శుభ్రం చేసుకోవాలి. ప్రశాంతంగా ఉండటాన్ని అలవాటు చేసుకోమని బుద్ధి చెప్పేది.'

'మీరో విషయాన్ని గమనించారా? అమ్మాయిలకి నేర ప్రపంచం నుండి వచ్చే మాలాంటి వారిని చూస్తే ఏదో ప్రత్యేకమైన అభిమానం. బాంబేలో ఫిలింస్టార్ల కంటే మాలాంటి వారిని చూస్తే చెవికోసుకుంటారు. ఎందుకో తెలియదు. బహుశా మేము మిగతా వారికన్నా మ్యాన్లీగా కనిపిస్తామనా? ఎంతో మంది డబ్బున్న అమ్మాయిలు బాంబేలో అబ్బాయిల్ని మెయిన్‌టెయిన్ చేస్తారో తెలుసా? నేను ఇదే విషయాన్ని రశ్మీకి కూడా చెప్పాను. బాగా చదువుకున్న నీకు ఎలాంటి అబ్బాయి అయినా దొరుకుతాడు. నువ్వెందుకు నన్ను ప్రేమిస్తున్నావని. కొత్తలో ఆమెకి ఏం చెప్పాలో తెలిసేది కాదు. 'దాని గురించి నేను ఆలోచించలేదు, దీనికి జవాబు చెప్పడం కష్టం' అనేది. నాలుగైదు నెలల తరువాత ఒకరోజు బీచ్‌లో కూర్చున్నప్పుడు చెప్పింది. క్రిమినల్స్‌ని ప్రేమించి వారిని సరైన దారికి తీసుకురావటం ఒక రకంగా అమాయక పిల్లవాడికి బుద్ధి చెప్పి సరైన దారికి

తీసుకురావటం అనిపిస్తోంది. ప్రతి అమ్మాయికి తను ప్రేమించే కుర్రాడిలో తాగుడో, సిగరెట్ అలవాటో ఉండాలి. తను దాన్ని వదిలించాలి అనే ఆశ ఉంటుంది. నేరస్థుల్లో అలాంటివి వదిలించటానికి ఒకటా? రెండా? జీవితాన్నే మార్చాలి. అది ఎంతో ఛాలెంజింగ్‌గా ఉంటుంది తెలుసా?' అనేది.

'తను ఆ మాటల్ని చెబుతున్నప్పుడు నాకు నా గర్ల్‌ఫ్రెండేనా లేక చిన్నప్పుడు నాకు దూరమైన అమ్మ రశ్మిని ఆవహించి మాట్లాడుతుందా అని అనుమానం వేసేది.'

'రశ్మికి ఒక తమ్ముడు, ఒక చెల్లి ఉన్నారు. తమ్ముడు డిగ్రీ చదువుతున్నాడు, చెల్లి ఇంటర్ చదువుతుంది. నేను వాళ్లింటికి వెళ్తుండటం వల్ల వాళ్లంతా నాకు బాగా క్లోజ్ అయ్యారు. కానీ వాళ్ల నాన్న మొదట్లో నన్నో పురుగుని చూసినట్టు చూసేవారు. తర్వాత నిదానంగా ఇష్టపడటం మొదలుపెట్టారు. పొరపాటున కూడా నేను భాయ్‌లతో ఉంటున్నానని చెప్పలేదు. రశ్మి కూడా ఈ విషయం దాచిపెట్టింది. కానీ ఒక తమాషా గమనించారా? మీరు ఇంత డీసెంట్‌గా కనిపిస్తున్నారు. అయినా మిమ్మల్ని చూసిన వెంటనే అండర్‌వరల్డ్‌కి చెందినవారని ఎవరైనా గుర్తుపడతారు. అదెలా అనేది నాకర్థం కాదు. బహుశా మన ముఖాల్లో మనం నివసించే ప్రపంచం కనిపిస్తుందేమో?'

'రశ్మి చెల్లి రాఖీ విషయంలో ఆరునెలల క్రితం ఏమైందో తెలుసా? ఒక కుర్రాడు రోజూ ఎదురై, తనని, తన ఫ్రెండ్స్‌ని ఆటపట్టించేవాడు. రాఖీ కూడా కొంచెం స్ట్రిక్ట్ అమ్మాయే. ఒకసారి ఐస్‌క్రీమ్ తింటూ కూర్చున్నప్పుడు, ఆ కుర్రాడొచ్చి పక్కలో కూర్చున్నాడు. సహనాన్ని కోల్పోయిన రాఖీ కోపంతో 'నీకు వేరే పనేం లేదా బాస్టర్డ్' అంది కోపంగా. అది వింటూనే ఆ కుర్రాడు షాకయ్యాడు. కానీ ఎవరినీ అలా ఎప్పుడూ తిట్టని రాఖీ తర్వాత చాలా భయపడిపోయింది. ఇంటికొచ్చి రశ్మి ఎదుట జరిగిందంతా చెప్పుకొని కన్నీళ్లు పెట్టుకుంది. అప్పుడు నేను అక్కడే ఉన్నాను. 'ఏం కాదు, ఊరికే ఉండ'మని చెప్పాను.

కానీ ఆ విషయం అంతటితో ఆగలేదు. ఆ కుర్రాడు, మరుసటిరోజు తనతోబాటు నాలుగైదుగురు కుర్రాళ్లని వెంటపెట్టుకురావటం మొదలుపెట్టాడు. రాఖీ అన్నయ్య ఒకరోజు తన ఇద్దరు స్నేహితుల్ని వెంటపెట్టుకొని కాలేజీ దగ్గరికెళ్లాడు. ఆ కుర్రాళ్లు అతడికి బాగా వార్నింగిచ్చారు. కానీ గొడవ చేసిన కుర్రాడు దీన్ని చాలా సీరియస్‌గా తీసుకున్నాడు. నేను ఈ సమస్యని పరిష్కరిస్తానంటే రశ్మి అస్సలు ఒప్పుకోలేదు.'

'ఇంతటితో ఆగక రశ్మీ తమ్ముడు ఒకరోజు ఇంటిదగ్గరున్న ఒక చిన్న గ్యాంగ్‌ని తీసుకెళ్లి రాఖీని టీజ్ చేసినవాడ్ని బాగా ఉతికించాడు.'

'సాయంత్రం వచ్చి అతడు తన ప్రతాపాన్ని గొప్పగా చెప్పుకున్నాడు, ఇక మీద రాఖీ జోలికి ఎవరూ రారని!

'కానీ మరుసటిరోజు కాలేజీ ముగించుకొని వచ్చేటప్పుడు రాఖీపై ఆ కుర్రాడు యాసిడ్ పోశాడు.'

అంతవరకు ఊరికే ఊకొడుతూ వింటున్న నేను ఒక్కసారిగా షాకయ్యాను. ఛ! ఎంత చిన్న విషయానికి ఒక అమ్మాయి జీవితాన్ని నాశనం చేశారని బాధ కలిగింది.

'మీ బాంబే చాలా ఇన్ హ్యూమన్ సిటీ' అన్నాను.

'చూడండి, బయటివాళ్లు బాంబేలో జరిగే ప్రతి క్రైమ్ అండర్‌వరల్డ్‌కి సంబంధించిందని అనుకుంటారు. కానీ అక్కడ ఒక అండర్‌వరల్డ్ హత్యకు పది హత్యలు సాధారణ ప్రజల ప్రపంచంలో జరుగుతుంది. ఏమిటంటే మొత్తం ముంబై ప్రజలు అండర్‌వరల్డ్ మనస్తత్వాన్ని పెంచుకున్నారు.'

'కానీ యాసిడ్ ముఖం మీద పడలేదు. భుజం మీద పడి వేసుకున్న సల్వార్ కమీజ్, దుప్పట్టా వల్ల చర్మానికి పెద్దగా ఏం కాలేదు. చేతిమీద మాత్రం ఒక రూపాయి నాణెం సైజులో మచ్చలా మరక మిగిలింది.'

'ఇప్పుడు నేను జోక్యం చేసుకోవటం తప్పనిసరి అయింది. నన్ను నేర ప్రపంచం నుండి బయటికి రమ్మని బలవంతం చేసే రశ్మీ కళ్లెదుటే, నేను యాసిడ్ పోసిన కుర్రాడికి బుద్ధి చెప్పాల్సి వచ్చింది. కానీ అదంతా పోలీసులు చూసుకుంటారు, ఊరికే ఉండమని ఒకటి రెండుసార్లు అరిచింది. కానీ రశ్మీ వాళ్ల నాన్న నన్ను ఏదైనా చేసి ఈ సంఘటనకి ముగింపు చెప్పమన్నప్పుడు, తను మౌనంగా ఉండిపోయింది. ఆ కుర్రాణ్ని తీసుకెళ్లి బాగా తన్ని క్షమాపణలు చెప్పించాను. అతడిని షూట్ చేస్తాను అంటే రశ్మీ ప్రమాణం చేయించుకొని వద్దని బతిమాలింది. తర్వాత అంతా సర్దుకుపోయింది. ఆ సంఘటన జరిగిన తర్వాత రాఖీకి చదువుపై ఇంటరెస్ట్ తగ్గిపోయింది. ఇప్పుడు కోల్‌కతాలోని ఒక ఇంజినీర్‌తో పెళ్లి నిశ్చయమైంది.'

కొంచెంసేపు మౌనంగా ఉండిపోయాడు. గట్టిగా వేళ్లతో నుదుటిని ఒత్తుకోవటం కనిపిస్తుంది.

నేను ఊరికే కళ్లు మూసుకున్నాను.

నాకు అప్పుడే నిద్ర ముంచుకు రాసాగింది.

ఉన్నట్టుండి అతడి గొంతు పెగిలింది. 'రాఖీకి యాసిడ్ వేసింది ఎవరో తెల్సా? నేనే.'

ఆ శబ్దాలు ఎక్కడో దూరం నుండి ఎవరో చెప్పినట్లు వినిపించాయి. అంత నిద్ర మత్తులోనూ అతడు చెప్పింది విని నాకు ఒళ్లు జలదరించింది.

'అలాంటి పని చేయకుండా ఉండాల్సింది' కోపంగా అన్నాను.

'నేను మీకు చెప్పింది అది తప్పో ఒప్పో అని మీ అభిప్రాయాన్ని తెలుసుకోవటం కోసం కాదు. మీతో చెప్పుకోవాలి కాబట్టి చెబుతున్నాను. నా స్థానంలో మీరున్నా అలాగే చేసేవారు.'

'ఆ అమ్మాయి మీద యాసిడ్ చల్లటం వల్ల మీకేం ఒరిగింది?' క్షీణ స్వరంతో అడిగాను.

'రశ్మీ... రశ్మీ మీద ప్రేమతో నేను ఈ హింసకు పాల్పడ్డానని, నేను తను భావించినంత చెడ్డవాణ్ని కానని తనని నమ్మించాల్సొచ్చింది. అలాగే నాపై ఉన్న తన ప్రేమని రెట్టింపు చేసుకోవాలనిపించింది.'

నేను అతడితో వాదించే స్థితిలో లేను. ఎంత ప్రయత్నించినా కళ్లు తెరవటానికి సాధ్యపడడం లేదు. అతను గొణుగుతూనే ఉన్నాడు. నిద్ర ముంచుకొస్తున్నప్పటికీ అతడి మాటలు వినిపిస్తూనే ఉన్నాయి.

'ఇప్పుడు నేనుండే పరిస్థితిని మీరెప్పుడైనా అనుభవించి ఉంటే అర్థమయ్యేది. మీరు చేసిన హత్యల గురించి చెప్పుకోవాలనిపించినప్పుడు మీకర్థమవుతుంది. మీరు చేసిన అన్ని హత్యల్ని మీరు రైట్ అని సమర్థించుకోవటానికి సాధ్యమవుతుందని అనుకుంటున్నారా? ప్రతి ఒక్కరూ ఏవో కారణాలు చెబుతూ తమని డిఫైన్ చేసుకుంటూ, ఆ కారణాల వల్ల ఈ ఊబిలో దిగవలసి వచ్చింది అని అంటారు. అదంతా బోగస్. దేశంలో ఎన్నో కోట్లమంది మనుషులు ఏ నేరాన్ని చేయకుండా హాయిగా జీవించటం లేదా? ఈ డాన్‌లు ఇన్ని హత్యల్ని చేయిస్తారు. ఏ ఒక్కడికైనా ప్రాణం పోశారా? అది ఇవ్వటానికి వారికి సాధ్యపడుతుందా? ఎవరూ ఎవరి ప్రాణాన్ని కాపాడలేరు. కేవలం ప్రాణం తీయటంలోనే నిమగ్నులై ఉంటారు. నేనేం అమాయకుణ్ని కాను. నేను అంతే, వాళ్ల అధీనంలో ఉండేవాణ్ని. నాకు ఈ రోజు కలిగిన జ్ఞానోదయం ఏ పదేళ్ల క్రితమో కలిగుంటే ఎంతో మంది బతికుండే వాళ్లు' ఏక ధాటిగా అతడి నోటి నుండి మాటలు వెల్లువలా ఉబికివస్తున్నాయి.

అతడు నిద్రపోయాడో లేదో తెలియదు. నాకు మాత్రం పూర్తిగా నిద్ర ముంచుకొచ్చేసింది.

సాధారణంగా ఎన్ని గంటలకి నిద్రపోయినా పెందరాళే లేచే అలవాటున్న నాకు ఆ రోజు మెలకువ వచ్చేసరికి ఎనిమిది గంటలైంది. కళ్లు తెరచి అతడివైపు చూడటానికి మనస్కరించలేదు.

ఉదయం లేస్తూనే దేవుడి ఫోటోలని చూసే అలవాటు లేకపోయినా, ఆరోజు హత్య కాబోయే అతడి ముఖాన్ని చూడటానికి ఒక రకమైన భయమేసింది.

నా కుడివైపున అతడున్నాడు. ఎడమవైపు నుండి లేచి కిటికి నుండి బయటికి చూశాను. విశాలమైన పచ్చదనం అన్ని దిక్కుల నుండి కళ్లకి కనిపించింది. పక్షుల కలరవం హాయనిపించింది.

రెండు నిమిషాలు తదేకంగా చూసి తర్వాత అతడివైపు తిరిగాను.

అతడు చిన్నగా నవ్వాడు.

ప్రశ్నార్థకంగా అతడి వైపు చూశాను.

'మీరు లేచిన వెంటనే నా ముఖం చూడలేకపోయారు కదూ?' అని అడిగాడు.

'మీరు ఊరికే ఏదో ఊహించుకుంటున్నారు' చల్లగా జవాబిచ్చాను.

'చూడండి సాధారణంగా ఎవరైనా కుడివైపు నుండి నిద్ర లేస్తారు. మీరు నన్ను అవైడ్ చేయటానికి ఎడమవైపు నుండి లేచారు.'

'అది కాదు. అలా అయితే కళ్లు మూసుకొని లేచేవాణ్ని.'

'అలా చేసుంటే ఇంకా స్పష్టంగా తెలిసేది. పోన్లెండి, మీ స్థానంలో నేనున్నా అలాగే చేసేవాణ్ని.'

'అతడు' ప్రతిసారీ నన్ను అతడితో సమీకరించుకోవటం నాకు మహా ఇబ్బందిగా అనిపించసాగింది.

కొంచెం కోపంగానే అన్నాను 'మీరు ప్రతిసారీ నా స్థానంలో మీరుంటే అని మాట్లాడుతున్నారు. కానీ మీరు చెప్పినట్లు మీ స్థానంలో నేనుండి, నన్ను ఎవరైనా హత్య చేయబోతారు అనే అనుమానం వస్తే నాలో ఉండే తెలివి, సామర్థ్యాన్ని ఉపయోగించి, వారికి వ్యతిరేకంగా ఫైట్ చేసేవాణ్ని. ఇలా ఫిలాసఫీ చెబుతూ కూర్చునేవాణ్ని కాదు. చావటం కచ్చితం అని తెలిసినప్పుడు ఎదురించి చచ్చిపోవటం మగతనం అని నా నమ్మకం!'

అతడు సిగరెట్ వెలిగించాడు.

'చూడండి బెంగుళూరు ఫీల్డ్‌కి ముంబై ఫీల్డ్‌కి చాలా ఫరక్ ఉంది. మీరిక్కడ ఒక వ్యక్తిని ఫినిష్ చేయాలంటే చాలాసార్లు అటాక్ చేస్తూ ఉంటారు. ఆ వ్యక్తులు చాలాసార్లు తప్పించుకుంటారు కూడా. కానీ మా దగ్గర అలా కాదు. మేము ఊరికే చెయ్యి వేయం. సరిగ్గా ఫీల్డింగ్ చేసి ఒకేసారి గురిపెడితే అంతే. నా

భాయ్ నాకు నేర్పింది దీన్నే. నీమీద అటాక్ జరిగితే, నువ్వు చచ్చిపోవటం ఖాయం అనిపిస్తే ఊపిరి బిగపట్టి ఊరికే మౌనంగా ఉండిపో. తప్పించుకోవటానికి ప్రయత్నించవద్దు. అప్పుడు కేవలం చావుని మాత్రమే కాదు. నరకాన్ని కూడా అనుభవించాల్సి వస్తుంది. బాధపడుతూ చచ్చేది పిరికివాళ్లు మాత్రమే. మనుషుల్ని చంపగలిగే మనం చావటానికి కూడా సిద్ధంగా ఉండాలి. నిజంగా మన సామర్థ్యం తెలిసేది, మనం చావుని ఎదురించగలం అన్న మాటమీద' అని చావు గురించిన తన అభిప్రాయాన్ని వివరించాడు.

దిండుమీద మోచెయ్యి ఆనించి సిగరెట్ కాలుస్తున్న అతడు నిటారుగా కూర్చున్నాడు. సిగరెట్ పొగవైపు, నావైపు మార్చి మార్చి చూస్తున్నాడు.

ఆ క్షణంలో అతడి ముఖం ఒక యోగి ముఖంలా కనిపించింది. అతడిలో నాకు చావు గురించిన ఆందోళన కాని, భయంకాని కనిపించలేదు.

'రాత్రంతా నేను నిద్రపోలేదు. రశ్మీ ముఖం కళ్లనుండి చెదరలేదు. మగత నిద్రలో ఏదో రైల్వేస్టేషన్ దగ్గర నిలబడ్డాను. తెల్లరంగు సల్వార్ కమీజ్ వేసుకుంది తను. నేను ఆమె చేతులు పట్టుకొని నన్ను క్షమించమని అడుగుతున్నాను. ఆమె నన్ను ఓదారుస్తుంది. నేను మళ్లీ దొరకనని చెబుతున్నాను. ఆమె కళ్ల నిండా నీళ్లు, స్పష్టంగా కనిపిస్తున్నాయి. నాకు మెలకువ రాగానే కనీసం ఆమె కన్నీటిని తుడవలేకపోయాననీ బాధ కలిగింది.'

'రాత్రంతా ఆమె గురించే మాట్లాడినందువల్ల తన గురించి కలొచ్చిందేమో' అన్నాను నేను.

ఉండొచ్చేమోనని తలూపాడు.

అతడి కలలో నాకు ఏ ప్రత్యేకత కనిపించలేదు. రాత్రంతా రశ్మీ చెల్లిపై యాసిడ్ వేసిన విషయం అతడ్ని వెంటాడుతున్నందువల్ల, కలలో ఆ భావాలకి ఒక రూపం ఏర్పడి ఉండవచ్చనుకున్నాను.

అతడు ముసలమ్మ హత్య గురించి నాకు పూర్తిగా చెప్పలేదు. హత్య సంగతి మాట్లాడుతూ మేం మంగళూరికొచ్చాం. ఆవిడ హత్యచేయబడిందో లేదో తెలుసుకోవాలని నాకు ఆదుర్దాగా ఉంది.

'నిన్న మీరు వృద్ధురాలి హత్య గురించి పూర్తిగా చెప్పలేదు. తర్వాత ఏమైంది?'

అతడు నిట్టూర్చాడు.

'ఇప్పుడు దాని గురించి మాట్లాడే మూడ్ నాకు లేదు. ఇప్పటికీ నన్ను వెంటాడేది ఒక్కటే. హత్యకు ముందు ఆమె నా ముఖాన్ని చూస్తూ, వద్దు బేటా, వద్దు బేటా అని రెండుసార్లు బాధతో అరిచింది. కానీ నేను వదిలిపెట్టి వచ్చే స్థితిలో లేను.'

రశ్మీ చెల్లి మీద యాసిడ్ పోసింది, వృద్ధురాలి హత్య వెనుకనున్న అతడి చల్లటి క్రౌర్యం, అతడిపై కోపం తిరస్కారం కలిగించాయి. అదే భావంతో అతడి ముఖాన్ని గమనిస్తున్నాను.

నాలో ఒక అనుమానం లాంటి భావన కలిగింది. ఈరోజు రాత్రి అతడిని ఫినిష్ చేసేటప్పుడు 'వద్దు ఫ్రెండ్' అనో, లేక 'వద్దు బ్రదర్' అని అతడు బ్రతిమాలితే నేను దాన్ని ఆపగలనా? బాస్ దీన్ని ఒప్పుకుంటారా? అతడు మన శత్రువు కాబట్టి చంపటం సరైనది అంటారు. కానీ రెండు రోజుల్లో అతడు నాకు ఎంతో ఆత్మీయుడయ్యాడు! అతడిని శత్రువని నేను ఎలా భావించాలి? నాలో సంఘర్షణ మొదలైంది.

బయట కార్ ఆగిన శబ్దం వినిపించింది. ఒక కుర్రాడు బయటినుండి గడియ తీశాడు.

'లేచారా? ఏం ఈ రోజు ఎక్సర్‌సైజ్ చేయటానికి లేవలేదు అనుకున్నాను. రండి, బాస్ వచ్చారు' అని పిలిచాడు.

ఎవరూ ఆరోజు అగ్రెసివ్ మూడ్‌లో లేరు. మీరు ద్వేషించే వ్యక్తి రెండు రోజులు మీతోబాటు ఉంటే అతడ్ని హింసించటానికి సాధ్యపడదు.

బాస్ ఆరోజు ఎవరితోనూ ఎక్కువ మాట్లాడలేదు. మధ్యాహ్నం వరకు అతడు బాస్ పక్కనే ఉన్నాడు. అతడికి తుళు భాష సైతం వస్తుండటం వల్ల బాస్ అతడి ముందు తన కుర్రాళ్లతో ఏం మాట్లాడలేదు.

బాస్ కుర్రాళ్లతో నేను బయట పచార్లు చేస్తున్నాను. వాళ్లలో ఒకడు గుర్రపు పందాలకి, అమ్మాయిలకి అడిక్ట్ అయ్యాడు. అతడికి ఎంత డబ్బూ సరిపోయేది కాదు. ఒకటిరెండు చిన్న డీల్స్ ఉన్నాయని, బాస్ జోక్యం లేకుండానే మనమే చేయవచ్చుని, నేను కొంచెం ఇంట్రస్ట్ చూపించాలని అప్పుడప్పుడు అడిగేవాడు. సాధారణంగా బాస్ కుర్రాళ్లతో బాస్ అనుమతి లేకుండా నేను ఏ పని చెయ్యను. కానీ బాస్‌కి ఈ విషయం తెలియజేస్తే మంచిదని చెప్పాను.

బెంగుళూర్‌కి వెళ్లిన తర్వాత తెలియజేస్తానని చెప్పాడు. మేం ఇద్దరమే ఉన్నప్పుడు పొరపాటున కూడా అతడి హత్య గురించి మాట్లాడలేదు.

బాస్ చేతికి బ్యాండేజ్ అలాగే ఉంది. ఇంకా పదిరోజుల వరకు తీయరు. ఈజీ చెయిర్ మీద హాయిగా కూర్చొని ఉన్నాడు. అతడు బాస్ పక్కలో కుర్చీలో కూర్చోని ఉన్నాడు. బాస్, అతడు గుప్పుగుప్పున పొగ వదులుతూ సిగరెట్ కాలుస్తున్నారు. ఇద్దరి ఆందోళన నాకు అర్థమైంది.

భోజనం చేసిన తర్వాతనే బాస్‌కి నాతో మాట్లాడటానికి సమయం దొరికింది. అతడిని కొద్ది సేపు విశ్రాంతి తీసుకోమని బయటికి పంపించాం.

గదిలో మేమిద్దరమే మిగిలాం.

కొంచెంసేపు బాస్ ఏం మాట్లాడకుండా నన్నే చూస్తున్నాడు. అతడికి ఈ పని పూర్తి చేయకముందే దు:ఖం కలిగిందేమో! దాన్ని నాతో పంచుకోవటానికి సిద్ధంగా ఉన్నట్టనిపించింది. కానీ నా ముఖంలో కాని, శరీరంలో కాని ఎలాంటి వెనుకెంజకు అవకాశం లేదు. ఒక రకంగా బంధాలని తెంచుకున్న నిశ్శబ్ద పాత్రధారిలా ఉన్నాను నేను.

కానీ అతడి గురించి నాలో కలిగిన భావాలు అతడిని విడుదల చేయటానికి, బాస్‌ని ఒప్పించటానికి ప్రేరేపించసాగాయి.

'ఏం అన్నీ సిద్ధం చేసుకున్నారా?' బాస్ కీచు గొంతుతో అడిగాడు.

'ఇందులో సిద్ధం చేసుకోవటం ఏముంది? ఏ నిమిషం అని డిసైడ్ కావాలి అంతే' నీరసంగా చెప్పాను.

విషాదంగా నవ్వాడు బాస్.

'ఒక కోడిని కోసినంత సులభమైపోయాడు చూడండి, మొత్తం ముంబైలో వెలుగు వెలిగిన అదృష్టం బెంగుళూరులో తన్నుకుంది. మీకేం అనిపిస్తోంది?'

'దేని గురించి?'

'అదే.. అతడి గురించి.'

కొంచెంసేపు మౌనంగా ఉండిపోయాను. బాస్ ఆసక్తిగా నన్ను చూస్తున్నాడు.

'చూడండి నేను ప్రొఫెషనల్ కిల్లర్‌ని కాను. బెంగుళూరులో చేతికి దొరికిన వెంటనే అతడిని ఫినిష్ చేయటానికి చేతులు సిద్ధంగా ఉండేవి. ఇప్పుడు అతడిని ముట్టుకోవటానికి సైతం నాకు సాధ్యపడటం లేదు. అయినా అతడేమంత డేంజరస్‌గా కూడా కనిపించట్లేదు.'

'నేను మళ్లీ ముంబైకి ఫోన్ చేసి వాకబు చేశాను. అతడ్ని వదిలిపెడితే ఈరోజు కాకపోతే రేపైనా మీకు మృత్యువు కాగలడు అని హెచ్చరించారు. అతడి రికార్డ్ చూస్తే నాకూ నిజమనిపిస్తోంది.'

నెమ్మదిగా నిట్టూర్చాను నేను.

'మీరో పని చెయ్యండి. మనవాళ్లతో వెళ్లి వెనకనున్న స్థలాన్ని ఒకసారి సర్వే చేసి రండి. సాధ్యమైనంత వరకు రాత్రి తొమ్మిది గంటలలోపు అంతా జరిగిపోవాలి. బాడీని పెద్దగుంతలో వేసి పెట్రోల్ పోసేస్తే సరి. మనం బెంగుళూరు వెళ్లిపోవచ్చు.

తర్వాత ఉదయాన్నే ఎముకలేమైనా మిగిలుంటే మనకుర్రాళ్లిద్దరూ ఇక్కడే ఉండి ఏ క్లూ దొరకకుండా చేస్తారు. ఇప్పుడు మీరు వెళ్లి రండి.'

'అతడు మాతోబాటు వస్తాడు. ఏం చేయమంటారు?'

'నేను అతడ్ని పిలుస్తున్నానని చెప్పండి.'

బరువుగా అడుగులేస్తూ బయటికెళ్లి బాస్ పిలుస్తున్నాడని చెప్పాను. అతడు ఆశ్చర్యంగ, చూశాడు. నేను అతడివైపు చూడలేదు.

బాస్ కుర్రాళ్లు మొత్తం ఆరుమంది, ఫారంకి సంబంధించిన మరో వ్యక్తితో బయలుదేరాం. చాలా పెద్ద ఫారం అది.

ఎత్తయిన ప్రదేశం మీద కొంచెం దూరంవెళ్లి కుడివైపు తిరిగాం. బాగా దృఢంగా, ఆకాశం ఎత్తు ఏపుగా పెరిగిన చెట్లు. వాటికి ఆనుకొని పచ్చగా నిగనిగలాడే చిన్న చిన్న చెట్లు, పొదలు, తీగలు. నేలంతా విశాలంగా పరుచుకున్న ఎండుటాకులతో నిండి ఉంది. అక్కడక్కడ చేతికి గుచ్చుకుంటున్న ముళ్లచెట్లు.

బాస్ కుర్రాడు ఫారం గురించి, అడవి పరిసరాల్ని వర్ణిస్తూ అడుగులేస్తున్నాడు. పక్కలో చిన్న పిల్లకాలువ పారుతుంది. సుమారు పది అడుగుల వెడల్పున్న కాలువ అది. ఏడెనిమిది అడుగుల కింద చాలా వేగంగా నీళ్లు పారుతున్నాయి. కాలువ చిన్నదైనప్పటికీ అక్కడక్కడ చిన్న చిన్న రాతిబండలు కనిపిస్తున్నాయి.

కాలువను దాటడానికి మధ్యలో అడ్డంగా ఎండిపోయిన కొబ్బరిచెట్టుని వంతెనలా పెట్టారు. కొంచెం బ్యాలెన్స్ చేస్తూ దానిమీద నడవాలి. ఫారం కుర్రాడు ఒకరివెనుక ఒకరు వెళ్లమని చెప్పాడు.

నా మనసంతా అతడి చుట్టే తిరుగుతుంది. అతడి పొడవాటి ముక్కు, ఎప్పుడూ ఏదో వెతుకుతూ కనిపించే ఆకర్షణీయమైన కళ్లు నన్ను విపరీతంగా వెంటాడుతున్నాయి. ఈ రాత్రి గడిచేలోపు అతడు ఈ భూమి, ఆకాశంలో లీనమవుతాడు. ఏం చేసినా దీన్ని తప్పించటానికి సాధ్యపడదని ఆలోచిస్తూ చెట్టు వంతెన మీద కాలుపెట్టాను. బ్యాలెన్స్ చేయటం కోసం రెండు చేతుల్ని చాచి నాలుగైదు అడుగులు వేశాను.

అంతలోనే ఏం జరిగిందని తెలిసే లోపల కిందపడున్నాను. ఎండిపోయిన ఆ చెట్టు విరిగింది. ఆలోచిస్తూ ఏకాగ్రత కోల్పోయిన నేను నాముందున్న మనిషి వంతెన దాటకముందే అడుగుపెట్టాను. ఇద్దరి బరువు మోయలేక చెట్టు విరిగింది. ముందున్న వ్యక్తి అటువైపున్న మనిషి చేయి పట్టుకున్నందువల్ల బతికిపోయాడు.

నాకు తొడభాగం, వీపు, చేతులకి బాగా దెబ్బలు తగిలాయి. పదునుగా ఉన్న రాయొకటి తొడకి గుచ్చుకొని రక్తం వచ్చింది. మిగతా చోట్ల రక్తం రాకపోయినా, దెబ్బలు తగిలాయి.

నా బట్టలన్నీ తడిసిపోయాయి.

ఈ పరిస్థితిలో ముందుకెళ్లి రాత్రి అతడిని ఫినిష్ చేయబోయే స్పాట్‌ని చూడటం వద్దనిపించి, కాసేపు ఆలోచించి, వెనక్కి వెళ్లి బట్టలు మార్చుకుందామని ఆలోచిస్తూ వెనక్కి తిరిగి అడుగులేయసాగాను.

నా శరీరంపైనున్న బట్టలనుండి నీళ్లు కారుతున్నాయి. వేము ఇంటిదగ్గరికెళ్లినప్పుడు ఎవరో బాస్‌కి ఈ విషయం చెప్పారేమో, ఆదుర్దాగా బాస్ బయటికొచ్చాడు, వెనకే అతడు వచ్చాడు.

నిద్ర నుండి లేచివచ్చిన బాస్ రెండుక్షణాలు ఏదో అనుకోనిది జరుగుండవచ్చని ఆందోళన చెందాడు. అంతలోనే సర్దుకున్నాడు.

నాదగ్గర వేరే బట్టలు లేవు. బాస్ కజిన్ ప్యాంట్ బాగా లూజుగా ఉంది. కట్టుకోవటానికి లుంగీ ఇచ్చారు. నేను సాధారణంగా లుంగీ కట్టుకోను. అయినా విధిలేక తీసుకున్నాను.

నా బూట్లు బాగా తడిసిపోయాయి. వాటిని అక్కడే వదిలేసి హవాయి చెప్పులు వేసుకోబోయాను.

అంతలోనే అతడు ముందుకొచ్చాడు. తన రూమ్ నుండి ఒక కిట్‌బ్యాగ్ తెచ్చాడు.

'నా దగ్గర జీన్స్ ఉంది. మీ సైజ్ అనిపిస్తోంది. ట్రై చెయ్యండి' అన్నాడు.

'ఫర్వాలేదు.'

'ఇందులో ఫర్వాలేదు ఏమిటండీ. రండీ' అని నన్ను పిలిచాడు.

హత్య కాబోయే వ్యక్తి బట్టలు ధరించటానకి మనస్సు వెనకెంజ వేస్తుంది. అయినా అతడు తీసుకోమన్నప్పుడు వద్దనడం ఎలా?' బాస్ వైపు చూశాను.

'మీ ఇష్టం' అన్నాడు.

రూమ్‌కెళ్లి అతడి ప్యాంట్, టీషర్ట్ వేసుకున్నాను. సరిగ్గా అతికినట్లు సరిపోయాయి.

ఇంట్లో ఉన్నాం కాబట్టి అతడు షూ బయటికి తీశాడు.

'వేసుకోండి' అని ఇచ్చాడు. ఏం మాట్లాడకుండా వేసుకున్నాను. అవి కూడా సరిగ్గా సరిపోయాయి.

అతడు సంతోషపడ్డాడు.

బాస్ అతడి భుజం మీద చేయి వేసి పక్కకు తీసుకెళ్లాడు.

ఇలాంటి ఐరనీలు జీవితంలో సంభవించటం చాలా అరుదు. అతడి బట్టలు, అతడి షూ వేసుకొని అతడిని చంపబోయే స్థలాన్ని పరిశీలించటానికి బయలుదేరాను. అతడి డ్రస్ వేసుకున్నందువల్ల, అతడి వ్యక్తిత్వపు నీడ కానీ, ప్రకంపనలు కానీ నాలో స్పందించవచ్చునేమో అని లోతుగా అనుభవించటానికి ప్రయత్నించసాగాను.

లేదు ఏం కాలేదు. అతడి బట్టల్ని ధరించటానికి ముందున్న ఆందోళన నన్ను వెంటాడుతూనే ఉన్నాయి.

ఈసారి జారిపడకుండా జాగ్రత్తగా వెళ్లాను. ఫారం హౌస్ నుండి దాదాపు ఒక ఫర్లాంగు దూరంలో ఉన్న స్థలాన్ని ఎంచుకున్నాం. అక్కడ రెండడుగుల వెడల్పు, నాలుగు ఆడుగుల లోతైన సుమారు యాభై అడుగుల కన్నా పొడవైన కాలువను తవ్వి ఉన్నారు. బహుశా ఏ నిర్మాణం కోసమో తవ్వి ఉండవచ్చు. నేను దాన్ని గమనించలేదు. అతడిని పైన గట్టుపై కూర్చోపెట్టి, మెడకి తాడు బిగించి, చంపిన తర్వాత కిందికి తోసి పెట్రోల్ పోసి నిప్పంటించాలని తీర్మానించటం జరిగింది.

అక్కడ నిలబడి సుమారు పదిహేను నిమిషాల పాటు ఏదైనా ఇల్లు కాని, గుడిసెలు కాని ఉన్నాయేమో అని దృష్టి సారించాం. ఇల్లు కాదు, ఒక్క మనిషి ఉనికి కూడా కనబడలేదు. ఫారం బాగా విస్తారంగా ఉన్నందువల్ల అక్కడ పనివాళ్లు సైతం కనిపించలేదు.

చీకట్లో పెట్రోల్ పోసి నిప్పంటించినప్పుడు, చాలా దూరం వరకు దాని జ్వాలలు కనిపించే అవకాశం ఉన్నందువల్ల, జాగ్రత్తగా ఉండాలని బాస్ చెప్పాడు.

మేం అన్నివైపుల నుండీ, ఎలాంటి అచాతుర్యానికీ అవకాశం లేదని నిశ్చయించి వెనక్కి వచ్చేశాం.

బాస్ మరో కుర్రాడు 'అతడి'తో పేకాట ఆడుతున్నారు. మేము వెళ్లగానే ఆట ఆపేశారు. బాస్ అతడికి ఆటలో గెలిచాడని, బాస్ రెండు వేల రూపాయలు అతడి చేతిలో పెట్టాడు. అతడు ఏం మాట్లాడకుండా తీసుకున్నాడు.

ఎంత విచిత్రమైన దృశ్యం ఇది! చావబోయేవాడు సంతోషంగా ఉండాలని, బాస్ అతడిని గెలిపించి డబ్బులివ్వడం, చంపడం కోసమే తనని ఆటలో గెలిపించి డబ్బులిస్తున్నారనీ అతడికి తెలిసుండటం – ఇద్దరి భావాలని తెలిసిన నేను ఏమీ చేయటానికి వీలులేని పరిస్థితి. బయటికొచ్చి బాస్ నాతో పాటు కొంచెం దూరంలో నడవసాగాడు.

నేను అతడి హత్య గురించి ఏ రకమైన అనుమానం పెట్టుకోవాల్సిన అవసరం లేదన్నాను.

బాస్ ఒప్పుకోలేదు.

'చూడండి. హత్య హత్యే. మనం ఏం కాదు అనుకుంటే, చేయబోయే హత్య మన జీవితాల్నే నాశనం చేయవచ్చు. మనం చాలా జాగ్రత్తగా ఏదైనా అవుతుందని అనుకునే సమస్య అసలు సమస్య కాకపోవచ్చు. ఎందుకైనా మంచిది, మన జాగ్రత్తలో మనముండాలి' అన్నాడు.

రాత్రి తొమ్మిది గంటలకు భోజనం చేసి, తర్వాత పడుకోవటానికి వేరే చోటికి వెళ్తున్నామని చెప్పి అతడిని తీసుకెళ్లమని చెప్పాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ అతడు అరవటానికి అవకాశం ఇవ్వకూడదని చెప్పాడు. మన అదృష్టం బాగలేక, దూరంలో ఎవరికైనా అతడి అరుపు వినిపించి ఏ అడవి జంతువో దాడి చేసిందేమోనని ఎవరైనా వచ్చేస్తే పథకం బెడిసికొడుతుందని చెప్పాడు.

నేను అన్నిటికీ తలూపాను.

చుట్టూ చీకటి పడుతుంది.

వెనక్కి వెళ్లిన తర్వాత బాస్ తన కుర్రాళ్లకి డ్రింక్స్ రెడీ చెయ్యమని చెప్పాడు.

అతడు 'రండి కాస్త నడుద్దాం' అని బాస్‌కి వినపడేలా, అవసరం కన్నా గట్టిగా చెప్పాడు. నేను ఏం మాట్లాడకుండా అతడితో వెళ్లాను.

బాస్ ముఖంలో ఏ ఆందోళన కనిపించలేదు. కొంచెం దూరంగా వెళ్లి అతను, నేను మౌనంగా నడవసాగాం. బాస్ కుర్రాడొకడు ఇరవై అడుగుల దూరం నుండి మా వెనక వస్తున్నాడు.

నాకు అతడితో ఎలా మాటలు మొదలుపెట్టాలో తెలియలేదు. మెదడు మొద్దుబారిపోయింది. కొంచెంసేపటి తర్వాత అతడే ప్రారంభించాడు.

'అలాగైతే ఈ రాత్రి అంతా అయిపోతుంది?'

అది ప్రశ్నో లేక అభిప్రాయమో నాకర్థం కాలేదు.

నేను మౌనంగా ఉండిపోయాను.

'జనాలని వేటాడుతూ బతికిన నేను, ఈరోజు వేటకు బలవుతున్నాను.'

దానికి నేను జవాబు చెప్పలేదు.

"నా జీవితంలో నేను రెండు హత్యల్ని చేయకుండా ఉండవలసిందని నిన్న చెప్పాను కదా. ఒకటి ఆ ముసలమ్మది. మరొకటి నా చేతులతో జరిగిన నేరం కాదు. కానీ దాన్ని తప్పించటానికి ప్రయత్నించక నాకు నేనే ద్రోహం చేసుకున్నాను. చూడండి, లైఫ్ ఎంత విచిత్రమో? నేను డిస్కో క్లబ్ చూసేవాణ్నని చెప్పాను కదా. దాని ఇన్‌ఛార్జ్ ఇరవై ఏళ్ల కుర్రాడి చేతిలో ఉండేది. అతడి తండ్రి ప్రాణ భీతితో

దుబాయ్‌లో భాయ్ దగ్గరే ఉండిపోయాడు. అతడి ఇద్దరు తమ్ముళ్లనీ మేం హత్య చేసినందువల్ల అతడు వణికిపోయాడు. కొడుకుని ముంబై బిజినెస్‌ని చూసుకోమని చెప్పి, హాయిగా ఉండిపోయాడు. ఒకరోజు దుబై నుండి ఫోన్ వచ్చింది, కుర్రాణ్ని ఫినిష్ చేయమనీ అని. నేను వద్దని అడ్డుకున్నాను. ఆ కుర్రాడు నాకు ఎంతో దగ్గరయ్యాడు. సొంత అన్నలా గౌరవించేవాడు. కానీ నాకు అందిన మెసేజ్ చాలా భయంకరంగా ఉంది, 'చెప్పినట్టు విను, దూసరా మాట్లాడవద్దు'. ఏ కుర్రాడితో నేను అత్యంత సన్నిహితంగా ఉన్నానో అతడిని నా చేతుల నుండే మృత్యు కూపంలోకి తొయ్యవలసి వచ్చింది. బాస్ నేను అతడిని ఫినిష్ చేయడానికి వెనుకెంజ వేస్తాననీ, అనుమానంతో ఇద్దరు ప్రొఫెషనల్స్‌ని సైతం ఫిక్స్ చేశాడు. ఆ కుర్రాడిని ఒకరోజు రాత్రి మంచి అమ్మాయిని డిస్కోకి ఫిక్స్ చేస్తున్నామని చెప్పి కారులో తీసుకెళ్లాను. మధ్యలో ఆ ఇద్దరు ప్రొఫెషనల్స్ నాతో పాటు బండెక్కారు. వాళ్లను బ్రోకర్లుగా పరిచయం చేశాను. బీచ్ పక్కలో వెళ్తూ ఉన్నప్పుడు ముందు కూర్చున్న అతడి తలని వెనుక నుండి ఫైర్ చేశారు. ఒకే క్షణంలో నన్ను అపరిమితంగా ఇష్టపడుతున్న ఆ కుర్రాడు శవమయ్యాడు. బండిలోనే బాడీని వదిలివెళ్లమని ఆర్డర్ వేశారు. ఇది జరిగి నెలరోజులైంది. అంతే. నేను బెంగుళూరుకి వచ్చాను. ఇక్కడొక పనుందని చెప్పి మీ బాస్ గురించి ఫీల్డింగ్ చేయటానికి చెప్పారు. ఇప్పుడు నన్నే అంతం చేయమని మీ బాస్‌కి చెప్పారు.'

అతడి మాటలని వింటుంటే, ఎంత దుర్భరమైన ప్రపంచంలో నేను జీవిస్తున్నాననిపించింది. ఆ క్షణంలో నాకు ఏ భీతి కాని, భయం కాని, ఆదుర్దా కాని, విసుగు కాని అనిపించలేదు. ఒక రకంగా వాటిని మించిన ప్రపంచంలో నేనున్నట్టు అనిపించసాగింది. ఇక్కడ ఎవరు ఎవరిని అంతం చేయటానికి ప్రయత్నిస్తున్నారు? ఎవరు ఎవరిని రక్షించటానికి ప్రయత్నిస్తున్నారు? ఒక్కటీ అర్థం కాలేదు. అంతం చేయటమే తమ ధ్యేయమని భావించే ఈ ప్రపంచంలో, నిరంతరంగా ఎవరినైనా అంతం చేయటమే జీవితానికి విలువనిచ్చే మార్గమేమోనని అనిపించసాగింది.

ఆ ప్రపంచంలో అందరూ హత్య చేయబడటానికి మరియు హత్య చేయటానికి ఉన్న లింకుల్లా కనిపించసాగారు.

ఏ కారణంతోనూ అతడిని అంతం చేయటం నేను జీర్ణించుకోలేకపోతున్నాను. అలా అని, అతడికి తప్పించుకోవటానికి సహకరించటానికి సాధ్యపడదు. అతడే నా నుండి ఎందుకు తప్పించుకుపోకూడదు?

నేను అతడి ముఖంవైపు చూడసాగాను. అతడు నన్నే చూడసాగాడు. కళ్లతోనే సూచనలిచ్చాను. మనస్సులోని అతడికి వినిపించాలని బిగ్గరగా అరుస్తున్నాను 'పరిగెత్తు, నువ్వు పరిగెత్తు. తప్పించుకో.'

ఆ అరుపులు అతడికి వినిపించాలని అనుకుంటున్నాను. ఏ క్షణంలోనైనా అతడు తప్పించుకుపోవచ్చుననే కుతూహలంతో చూడసాగాను.

అతడు నా ముఖం వైపు ప్రశాంతంగా చూస్తున్నాడు.

నేను కళ్లతోనే నీ ఇష్టం అని సైగ చేశాను.

అతడు 'ఒక్క నిమిషం' అని పక్కకి జరగసాగాడు. అది పెద్ద ఫారం అని ముందే చెప్పాను. పక్కకి అంటే దాదాపు రెండు వందల అడుగుల దూరంలో ఉన్న చెట్టు వైపు నడిచాడు.

వెనుక ఉన్న బాస్ కుర్రాడు నా దగ్గరికొచ్చి, ఆదుర్దాగా 'అతడు ఎక్కడికో వెళ్తున్నాడు' అన్నాడు.

'ఇక్కడికే వస్తాడు' చాలా మామూలుగా చెప్పాను.

"అతడికి ఇంకా తెలియదు కదూ?"

'తెలిసిందో లేదో అనేది నాకెలా తెలుస్తుంది? నాతో ఏం మాట్లాడలేదు' అని అసహనంగా అన్నాను.

'తెలిసినా ఏం చేయగలడు?' అంటూ లోపలికెళ్లాడు.

అతడు చెట్టువైపు నిలబడ్డది ఆ చీకట్లోనూ అస్పష్టంగా కనిపిస్తోంది. అలాగే తప్పించుకుపోతే, ఎంతో బావుండునని మనసులోనే ఆలోచిస్తున్నాను. మహా అయితే బాస్ 'మీరు కొంచెం కేర్‌లెస్ అయ్యారు' అని ఆక్షేపించి నిట్టూర్చవచ్చు. అంతకన్నా ఎక్కువ బుర్ర పాడు చేసుకోడు.

అతడు నిదానంగా ప్యాంట్ జిప్ వేసుకుంటూ వెనక్కొచ్చేశాడు.

ఇప్పటికీ అతడి ప్రవర్తన నేను అర్థం చేసుకోలేకపోయాను.

అతడికి, నాకు మధ్య ఉన్న దూరంలో అతడు పారిపోయి ఉంటే, అతడు కచ్చితంగా అతడిని పట్టుకోవటానికి కష్టమయ్యేది. అందులోనూ చీకటి దట్టంగా ఉంది. చుట్టూ చెట్లు, దట్టమైన అడవి. ఎక్కడో ఒకచోట దాక్కొని ఎస్కేప్ అయ్యుండొచ్చు. నేనున్న స్థలం నుండి ఒకసారి మృత్యు వల నుండి తప్పించుకుంటే మరో జన్మ పొందినట్లే!

కానీ 'అతడు' ఇదివరకే దృఢంగా నిశ్చయించాడనిపించింది. తన చావుతో సాన్నిహిత్యాన్ని పెంచుకున్నాడని, దాని నుండి బయటకు రావడం అతడికి అవసరం లేదని!

అతడెందుకు అలా తీర్మానించాడు. అతడిలోని భయం, అలజడి నాకు అసలెందుకు కనిపించలేదు? భౌతికంగా బాగా ఫిట్‌గా ఉన్నాడు. కానీ చావు నుండి తప్పించుకోకుండా, దానికి లొంగిపోయే మార్గాన్ని ఎందుకు ఎంచుకున్నట్లు?

వెనక్కి వచ్చి నాతో అడుగులు వేయసాగాడు. నేను నడుస్తున్నాను. అతడితో నేను ఏదైనా మాట్లాడ్డం అసాధ్యమనిపించసాగింది. ఇక రెండు గంటల్లో ఉనికిని కోల్పోయే వ్యక్తితో ఏం మాట్లాడటం? అలా అని మాట్లాడకుండా ఉండటం కూడా చాలా అసహనీయంగా అనిపించసాగింది.

చివరికి చెప్పేశాను: 'మీ యాటిట్యూడ్ నాకేం నచ్చలేదు."

నేలని చూస్తూ నిశ్శబ్దంగా అడుగులేస్తున్న అతడు ప్రశ్నార్థకంగా నావైపు చూశాడు.

"చూడండి. ఇది మనిద్దరి మధ్య మాత్రమే ఉండాలి. మీకు మీ హత్య కాబోతున్నారని తెలిసి కూడా మీరు పారిపోయే ఏ అవకాశాన్నీ ఉపయోగించలేదు. కనీసం ఆ ప్రయత్నం కూడా చేయట్లేదు. నాకు ఇది పెద్ద మగతనం అనిపించట్లేదు. మీరు మాట్లాడేటప్పుడు చూపించే గాంభీర్యానికి, ధైర్యానికీ, మీ ప్రవర్తనకీ ఏమాత్రం సంబంధం లేదు' అని కోప్పడ్డాను.

అతడు నిదానంగా నిట్టూర్చాడు. తర్వాత చిన్నగా నవ్వాడు.

'మీకింకా వేట అనుభవం సరిగ్గా ఒంటపట్టినట్టులేదు. ఇంతకీ మీరు ఎక్కడ వేటాడుతారు? మీరు మీ కోపానికి చేసిన ఒకటో రెండో హత్యలుండవచ్చు. ఒక జంతువుని వెంటాడితే, అది తన సరిహద్దును వదిలి బయటికి వెళ్లదు. తన పరిధిలోపే ప్రయత్నించి చివరికి మీకు ఆహుతవుతుంది. ఇప్పుడు నేనూ అంతే. ఇంత ప్రేమగా మాట్లాడే మీరు నేను ఎస్కేప్‌కి ప్రయత్నించిన వెంటనే మీరు నన్ను వెంటాడరనీ ఎలా నమ్మేది? మన ఫీల్డ్‌లో ముఖ్యమైన సంగతి ఏమిటంటే, ఇక్కడ ఎవరినీ నమ్మకూడదు. కాకపోతే ఆ చెట్టు దగ్గర నిలబడి ఒక్కసారి చూడండి. వంద అడుగుల దూరంలో రెండు వైపులా ఇద్దరు మనుషులు నిలబడ్డారు. కనిపిస్తుందా?'

'అబద్ధం. ఇక్కడ ఎవరూ లేరు. అందరూ లోపలున్నారు. మీరు తప్పించుకోగలరని ఎవరూ కలలో కూడా ఊహించలేరు.'

'నేను అదే అంటున్నాను. అక్కడ నాకు మనుషుల్లా కనిబడింది కేవలం నీడలై ఉండవచ్చు. అందులోనూ మీ బాస్ మీమీద పూర్తిగా ఆధారపడ్డారని మీరెందుకు అనుకుంటున్నారు? మీకు నేను పిరికివాడిలా కనిపిస్తూ ఉండవచ్చు. కానీ ఇది

నా ఎండ్ అని తెలిసి పోయింది. ఇక దాని నుండి తప్పించుకోవడం మగతనం కాదని.'

అతడి మాటల్ని విని నాకూ అనుమానం కలగసాగింది. అవును, బాస్ అలా ఆలోచించినదాంట్లో తప్పేం లేదు కదా? చావు నుండి పారిపోవడానికి ప్రయత్నించటం కన్నా ఎక్కువ తెగింపు చావుని స్వీకరించడంలో ఉండాలి. మళ్లీ నిశ్శబ్దం మా మధ్య చోటుచేసుకుంది.

ఈసారి అతడే దాన్ని బేధించాడు.

'మీ దగ్గర పెన్ ఉందా?' అడిగాడు.

'లేదు.'

'నేను రశ్మీ నంబర్ మీకివ్వాలి. రేపు తనకి ఫోన్ చేసి విషయం తెలుపగలరా?'

'ఏమని చెప్పాలి?'

'నేను యాక్సిడెంట్‌లో చచ్చిపోయానని చెప్పండి. శరీరం పూర్తిగా నుజ్జుగుజ్జయిందనీ, ఎవరూ బాడీని తీసుకుపోవడానికి రానందువల్ల, పోలీసులే అంత్యక్రియలు జరిపించారని చెప్పండి.'

అతడు విషయాన్ని ఎంత నెమ్మదిగా, చల్లగా చెప్పాడంటే, నాకు ఆ మాటలు భీకరంగా వినిపించాయి.

'చూడండి, అలా చేయడం వల్ల ఏం ప్రయోజనం? కాకపోతే పోలీసువాళ్లు యాక్సిడెంట్‌లో మరణించినవారి మృతదేహాలని కాల్చరు, పాతిపెడతారు. రశ్మీ బెంగుళూరుకి వస్తాను, బాడీని చూడాలి అంటే ఏం చెప్పాలి?'

ఒక్క క్షణం నిశ్శబ్దంగా ఉండి, తర్వాత నోరు విప్పాడు.

'మీరు ఎక్కువ వివరాలు మాట్లాడకండి. నేను యాక్సిడెంట్‌లో పోయానని చెప్పి ఫోన్ పెట్టేయండి. ఎక్కడ, ఏ ఊరు అని చెప్పకండి ప్లీజ్.'

'ఈ విషయం తనకి చెప్పాల్సిన అవసరం ఉందా?'

'మీకు తెలుసు. నాకు ఈ ప్రపంచంలో ఆత్మీయురాలు, సన్నిహితురాలు తనొక్కతే. రశ్మీ నన్ను చాలా ప్రేమిస్తుంది. నా వల్ల చాలాసార్లు బాధపడింది. విషయం తెలియకపోతే తను, నేను ఏ జైల్లోనో, లేక మరెక్కడో ఒకచోట ఉండవచ్చునేమో అని అనుకుంటూ సందిగ్ధంలో ఉంటుంది. బ్రతికినంతకాలం నేను ఎప్పటికైనా తిరిగి రాగలననీ ఎదురు చూస్తూ ఉంటుంది. ఒకవేళ ఎవరినైనా పెళ్లి చేసుకుంటే ఉన్నట్టుండి నేను కనిపించి ఇబ్బంది కలగవచ్చుననే భీతితో జీవించాల్సి వస్తుంది.'

అతడి బాధ నాకర్థమైంది. ఫోన్ నెంబర్ ఇవ్వమని చెప్పాను.

'మీ దగ్గర పెన్ లేదే?'

'అవసరం లేదు. నేను ఏదైనా గుర్తు పెట్టుకోవాలంటే ఎట్టి కారణంతోనూ మర్చిపోను. ఇప్పటికీ దాదాపు వంద కన్నా ఎక్కువ నంబర్లు నా నాలుక మీద ఉన్నాయి' అని కొంచెం గొప్పగా చెప్పాను.

'మీరు చాలా గ్రేట్' అని ప్రశంసిస్తూ నెంబర్ చెప్పాడు. ఏడంకెల నెంబర్లోని అన్ని అంకెల్ని కలిపితే వచ్చే సంఖ్య మూడు. ఒకే సంఖ్య మూడు చోట్ల వచ్చింది. చివరన సమ సంఖ్య ఉంది. ఆ నెంబర్‌ని మనస్సులో నోట్ చేసుకున్నాను. అతడి స్నేహితురాలికి ఫోన్ చేయటం, నేను అతడికి చేయగలిగే ఒకే ఒక్క సహాయం అనేది ఒక వైపుంటే, నేను ఇష్టంలేని ఆ హత్యలో పాల్గొనడం వల్ల దానికి ఇది ప్రాయశ్చిత్తం అన్నట్లు మనసులో సంఘర్షణ మొదలైంది.

అతడు ఆ నెంబర్‌ని నాలుగైదుసార్లు నాతో చెప్పించాడు. 'తనకి మీరు మరో విషయం చెప్పండి. దు:ఖించవద్దని, ధైర్యం తెచ్చుకోమని చెప్పండి. జీవితంలో అప్పుడప్పుడు ఇలా జరుగుతాయి. దాన్ని ధైర్యంగా స్వీకరించాలని చెప్పండి. తను ఇంగ్లీష్ అద్భుతంగా మాట్లాడుతుంది. మీరు ఇంగ్లీషులోనే మాట్లాడండి.'

అతడికి తన చావు కన్నా తన చావు గురించి స్నేహితురాలి ప్రతిక్రియ తెలుసుకోవాలనే తపన కనిపించింది. కానీ అతడికి దాన్ని తెలియచేయటం ఎలా?

అతడి మెడలో ఒక చైన్ ఉంది. దానికో డాలర్ కూడా ఉంది. దాన్ని మెడ నుండి బయటికి తీసాడు.

'మీకు ఇవ్వటానికి నా దగ్గర ఏం లేదు. ప్లీజ్ దీన్ని ఉంచండి.'

అది నా సహనానికి పెట్టిన ఆఖరి పరీక్షలా అనిపించింది.

'ప్లీజ్ దయచేసి వద్దు. ఏం చేస్తున్నారు మీరు. మీకు అర్థమవుతుందా? నన్ను ఏమనుకుంటున్నారు? దాన్ని నేను ఎలా ఉంచుకోను? నేను విలవిల్లాడి చావటం మీకిష్టమా?' అని విసుగ్గా, కుడికాలిని బలంగా నేలకేసి తన్నాను.

అతడు శాంతంగా, నా రెండు చేతుల్ని పట్టుకొని నిధానంగా చెప్పాడు: 'ప్లీజ్ వద్దనకండి. నేను చచ్చిపోయిన తర్వాత దాన్ని ఎవరైనా తీసుకుంటారు. కానీ అది మీ దగ్గరనే ఉండాలన్నది నా చివరి కోరిక. ఎందుకో తెలుసా? ఈ ప్రపంచంలో నాకు ఆత్మీయురాలు కేవలం రశ్మీ ఒక్కతే అని మీకు చెప్పాను. తర్వాత నేను నిజంగా ఆప్యాయతను చూసింది మీ దగ్గర మాత్రమే. రశ్మీ మీద ప్రమాణం చేసి చెబుతాను. ఇది నిజం'

అతడి కళ్లల్లో మొదటిసారి కన్నీళ్లు చూశాను. నా గుండెల్లో అగ్ని జ్వాలలు వ్యాపించసాగాయి.

ఇప్పటికీ ఒక్కోసారి ఏ అర్ధరాత్రి మెలుకువ వస్తే, ప్రపంచమంతా మైమరచి నిద్రపోతున్నప్పుడు నా గుండెల్లో ఆ అగ్ని జ్వలించటం మొదలుపెడుతుంది.

మన రక్త సంబంధీకులు కాక, జీవితంలో ఎదురయ్యే, అన్ని సంబంధాలు ఒక రకంగా Chancy, యాదృచ్ఛికం.

మీరు ఊరికే ఒక్క క్షణం అలాంటి మీ సంబంధాలని గుర్తు తెచ్చుకోండి. అవి ఎక్కడో ఒక చోట రూపించబడ్డ సంబంధాలే. మన జీవితపు సంఘర్షణలని మనమే సృష్టించుకున్నాం. ఆ బరువును మోస్తున్నది కూడా మనమే.

అతడు నాకు చైన్ ఇచ్చిన వెంటనే నన్ను బాధ పెట్టింది ఆ ఉద్వేగాలే.

మేము అలా నడుస్తున్నాం. అతడు తేలికగా ఉన్నాడు. నేను భారంగా ఉన్నాను.

బాస్ మమ్మల్ని పిలిచాడు.

నేను నిట్టూరుస్తూ అతడి వైపు చూశాను.

'జస్ట్ రెండు నిమిషాలు. కొంచెం ఇటువైపు వెళ్లొద్దాం' అన్నాడు.

నేను బాస్‌కి 'రెండు నిమిషాలు... వస్తాం' అని చెప్పి అతడి వెంట వెళ్లాను.

ఓ చెట్టు దగ్గరికి తీసుకెళ్లాడు.

ఒక్క నిమిషం కళ్లు మూసుకున్నాడు. తర్వాత షర్ట్ బటన్స్ విప్పాడు. కుడిచేతిని లోపలికి పెట్టి ఎడం చేతి నుండి ఏదో బయటికి తీశాడు.

అదొక తాయత్తు. దాన్ని కళ్లకి అద్దుకుని కింద కూర్చొని, నేల నుండి కొంచెం మట్టి తీసి దాన్ని పాతిపెట్టాడు.

లేచి నిలబడ్డాడు.

'పదండి వెళ్దాం' అన్నాడు.

నేను ఆసక్తిగా అడిగాను 'దాన్నెందుకు తీశారు?'

'దాన్ని నేను ఎంతో గౌరవించే ఒక బాబా ఇచ్చారు. అది నా వంటిమీద ఉన్నంతవరకు నాకు ఏ ఆపద రాదని చెప్పారు. వారికి నా నుండి అవమానం జరగకూడదు. వారి మాట అబద్ధం కాకూడదు. అందుకే తీసేశాను.'

'అలాంటప్పుడు మీరు దాన్ని తీయకుండా పరీక్షించవచ్చు కదా?' ఆ సందర్భంలోనూ ఆవగింజంత వ్యంగ్యాన్ని జోడించి అడిగాను.

'లేదు తప్పువారిది కాదు. ప్రతిరోజు వందసార్లు ఒక మంత్రం చదవాలని నన్ను ఆదేశించారు. నేను ఒకరోజు మాత్రం పాటించాను. ప్రతిరోజూ చేసుంటే

బహుశ...' మధ్యలోనే మౌనంగా ఉండిపోయాడు. అతడి భావాల్ని రెచ్చగొట్టడం ఇష్టంలేకపోయింది.

బాస్ దగ్గరికి వెళ్లాం. బాస్ భోజనానికి సిద్ధమవుతున్నాడు.

అందరం కలిసి కూర్చొని భోజనం చేసాం.

బాస్ సరదాగా మాట్లాడుతూ తనలోని అలజడిని బయటికి కనబడకుండా ఉండటానికి ప్రయత్నిస్తున్నాడు. మాకు అతడి సంఘర్షణ అర్థమవుతూనే ఉంది.

కానీ చిత్రంగా అతడు మాత్రం బాస్ మాటలకి నవ్వుతూ ప్రతిక్రియిస్తున్నాడు.

అందరి భోజనాలు ముగిశాయి.

ముగ్గురం బయటికొచ్చి కూచ్చున్నాం.

బాస్ సిగరెట్ వెలిగించాడు. అతడు బాస్ ఆఫర్ చేసిన సిగరెట్ వెలిగించాడు. కళ్లతోనే వెంట రమ్మని చెబుతూ బాస్ బయటికి నడిచాడు. నేను ఫాలో అయ్యాను.

బాస్ నా వైపు చూస్తూ 'అతడి మెడలోని చైన్ నీ దగ్గర...' అన్నాడు.

నేను మాట్లాడకుండా తలూపాను.

'అలాగైతే అతడికి తన గేమ్ జరుగుతుందని కచ్చితంగా తెలినట్టుంది.'

అవునన్నాను.

'ఛ' అని గొణిగాడు బాస్.

'ఇక ఆలస్యం చేయవద్దు. అతడితో నేను మీరందరూ పడుకోవటానికి వేరేచోటికి వెళ్తున్నారు, నువ్వూ వెళ్లు అంటాను. అతడిని మీతో పాటు తీసుకెళ్లండి. త్వరగా పని పూర్తయిపోవాలి. సాధ్యమైనంతవరకు అతడికి నొప్పి కలిగించకుండా పని పూర్తవ్వాలి.'

నేను బదులు చెప్పలేదు. అతడు తప్పించుకునే అన్ని దారులు మూసివేయ బడ్డాయని అర్థమైంది.

లోపలికెళ్లి బాస్ కుర్చీమీద కూర్చున్నాడు. అతడివైపు ఆత్మీయంగా చూశాడు. తర్వాత నా దగ్గర నిలబడ్డ తన కుర్రాళ్లతో 'మీరెళ్లి పడుకోండి' అన్నాడు.

వాళ్లు లేచి బయటికొచ్చారు. నేను తలుపు దగ్గర నిలబడ్డాను. అతడు కిటికి దగ్గర కూర్చోని ఉన్నాడు. బాస్ అతడి వైపు చూస్తూ 'మీరు ఇతడితో వెళ్లండి' అన్నాడు. ఒకసారి నా వైపు చూసి తర్వాత బాస్ వైపు తిరిగి అతడు 'నేను మీతో ఉంటాను' అన్నాడు.

బాస్ నుదుటిని వేళ్లతో రుద్దుకుంటూ 'వద్దు, వీరితో పాటు వెళ్లు' అన్నాడు. బాస్ పెద్ద గొంతుతో చెప్పకపోయినా అది కమాండ్‌లా ఉంది.

అతడు ఏం మాట్లాడక బయటికొచ్చాడు.

బాస్ కుర్రాళ్లు మా కోసం ఎదురుచూస్తూ గోడకి అనుకుని నిలబడ్డారు.

మేము చీకటిని చీల్చుకుంటూ నిదానంగా ఇంటి వెనుక వైపు అడుగులు వెయ్యసాగాం.

నా పక్కన అడుగులేస్తున్న అతడి ముఖాన్ని నేను ఓర కళ్లతో గమనిస్తున్నాను. అతడు ఒకసారి ఆకాశం వైపు, మరోసారి చెట్ల వైపు, నేలవైపు చూస్తూ, మధ్యలో నావైపు చూస్తున్నాడు. మేం ఫారం బయట నడవసాగాం. అంత చీకట్లోనూ మామూలుగా అడుగులేస్తే దాదాపు పదిహేను నిమిషాల నడక. మా వెనుక కొద్ది అడుగుల దూరంలో నా పర్సనల్ కుర్రాడు వస్తున్నాడు. బాస్ మనుషులు మా ముందర ఇద్దరు, వెనుక ఇద్దరు వస్తున్నారు. మరో ఇద్దరిని ముందుగా స్పాట్ దగ్గరికెళ్లి ఏర్పాట్లు పూర్తిచేయమని పంపించారు.

అటూ ఇటూ చూసి అతడు అడిగాడు 'నన్ను ఎలా ఫినిష్ చేయాలని నిశ్చయించారు?'

నేను ఏం మాట్లాడలేదు.

స్పాట్ దగ్గరికెళ్లినప్పుడు వెనుక నుండి ఇద్దరు మనుషులు అతడి మెడకి తాడు బిగించటం, మిగతావారు అతడు కదలకుండా చేతులు, కాళ్లు పట్టుకోవాలని అనుకున్నాం. దాన్ని అతనికెలా చెప్పడం?

నేను జవాబు చెప్పకపోవటం చూసి అతడు మళ్లీ అడిగాడు 'గన్ యూజ్ చేస్తారా?'

నేను లేదన్నాను.

'రేపు నా రశ్మీకి కచ్చితంగా ఫోన్ చేస్తారు కదూ?' అంటూ నా చేయి మృదువుగా నొక్కాడు.

'కచ్చితంగా చేస్తాను.'

'నెంబర్ చెప్పండి.'

సాధారణంగా నేను దు:ఖాన్ని బయటపెట్టను. దాచుకుంటాను. అయినా ఆ క్షణంలో నా గొంతు తడబడసాగింది. కళ్లల్లో నీళ్లు ఉబికాయి.

నెంబర్ చెప్పటానికి సాధ్యపడలేదు. చెప్పటానికి గొంతు పెగుల్చుకుంటే ఏడుపు తన్నుకొచ్చేలా ఉంది. నాకు తెలిసిన ప్రాణాయామం ద్వారా ఊపిరితీసుకోవటం మొదలుపెట్టాను.

'మీరు నెంబర్ మర్చిపోయారు?' అతడు ఆరోపించాడు.

అతడి గొంతులో కోపం, విసుగు లేదు. దు:ఖం లేదు. స్థిరంగా ఉంది.

నిదానంగా నెంబర్ చెప్పాను.

గంభీరంగా నా ముఖం చూశాడు.

'ఎందుకు దు:ఖిస్తున్నారు? ఇది జరిగి తీరాలి కాబట్టి జరుగుతుంది. ఎవరైనా చూస్తే మీది జాలి గుండె అనుకుంటారు. కంట్రోల్ చేసుకోండి' ఓదార్చేవాడిలా చెప్పసాగాడు.

మా అడుగుల చప్పుడు తప్ప చుట్టూ నిశ్శబ్దంగా ఉంది. గాలి వీచే శబ్దం మాత్రం ఏకధాటిగా వినిపిస్తోంది.

కుర్రాళ్లిద్దరు సిగరెట్ వెలిగించి నిలబడ్డారు.

వెనుక ఉన్న కుర్రాళ్లు వేగంగా నడుస్తూ ముందుకొచ్చారు. మా ముందున్న మనుషులు వెనుదిరిగి దగ్గరికొచ్చారు. మా ఇద్దరికీ బాగా దగ్గరగా నిలబడ్డ ఓ కుర్రాడు అతడి మెడమీద చేయి వేశాడు.

కదులుతున్న కాలం స్తంభించిపోయింది. నేను శిలలా నిలబడిపోయాను.

ఈ రోజు అతడు నా నుండి దూరమవుతాడని నేను కోరుకోలేదు. కానీ ఇది తప్పనిసరి.

అతడి హత్యని తప్పించలేకపోయాననే వేదనతో, నిస్సహాయతతో శిలలా నిలబడిపోయాను నేను.

కానీ అది కేవలం పది సెకెన్లు కూడా లేదు. అతడి గొంతుని ఓ కుర్రాడు తన మూచేతి జబ్బతో గట్టిగా పట్టుకొని బిగించసాగాడు. ముందున్న కుర్రాళ్లు వెనక్కి వచ్చి అతడు పెనుగులాడకుండా అతడి చేతుల్ని పట్టుకున్నారు.

అతడు కొంచెం కూడా పెనుగులాడక, విడిపించుకోవటానికి ఏమాత్రం ప్రయత్నించక నిలబడ్డ అతడి వైఖరిని చూస్తూ నిర్ఘాంతపోయాను.

క్షమించండి, నా కిష్టం లేకపోయినా గొంతు నులిమి హత్య చేయటం గురించిన కొన్ని వివరాలని ఇచ్చినప్పుడే నా ఆశ్చర్యానికి కారణం మీకర్థమవుతుంది.

మనిషి మెడని ఉరితాడుతో కానీ, చేతులతో కానీ, లేక ఏ వస్తువుతోనైనా కానీ బిగించినప్పుడు ఊపిరాడక చావటానికి కనీసం ఐదు నిమిషాలు పడుతుంది. అప్రయత్నంగా శరీరం పెనుగులాడుతుంది. ఉన్నట్లుండి చేతులు, కాళ్లు విచిత్రమైన బలంతో ఎదురిస్తాయి. ఊపిరి తీసుకున్నప్పుడు గొంతు నొక్కితే కనుగుడ్లు బయటికొస్తాయి. ఊపిరి బయటికి వదులుతున్నప్పుడు గొంతు నొక్కితే నాలుక బయటికొస్తుంది. రెండు సందర్భాలలో అన్ని రకాల శారీరక విసర్జన క్రియలు సహజంగా జరిగిపోతాయి.

కానీ అతడు నిశ్చలంగా నిలబడటం నన్ను కదిలించింది.

'వదలండి, వదలండి అతను పెనుగులాడటం లేదు' అని అతడి చేతులు పట్టుకున్నవారికి చెప్పి గొంతు నొక్కుతున్న కుర్రాడ్ని దూరంగా తోశాను.

అతడు... కాదు అతడి శరీరం కింద కుప్పకూలిపోయింది. అతడు ప్రాణం వదిలాడు.

అందరం నిర్ఘాంతపోయాం. ఒక చిన్న పసి పాప సైతం అంత తక్కువ వ్యవధిలో ప్రాణం వదలటం సాధ్యపడదు. నిజం చెప్పాలంటే ఆ సమయం పది సెకెన్లకన్న తక్కువ. అతడి చుట్టూ అందరం కూర్చున్నాం.

అతడు శవంగా మారిపోయాడు.

అతడి గొంతు మీద చేయి పెట్టినప్పుడే, అతడు ప్రాణం వదిలాడు. మేము అతడిని హత్య చేయబోయే ప్రమేయం రానేలేదు.

శరీరం నుండి ధరించిన బట్టల్ని తీసినంత సహజంగా అతడు ప్రాణత్యాగం చేశాడు.

అతడు ఏ తంత్రాన్ని నేర్చుకున్నాడు. అతడు మరణించిన వైఖరి, చుట్టూ ఉన్న మాలో చావు గురించిన ఒక రకమైన రొమాంటిక్ భావన కలిగించింది.

పది నిమిషాలు అందరూ నిశ్శబ్దంగా కూర్చున్నాం. తర్వాత ఒక్కొక్కరుగా లేచి నిలబడ్డాం. ఇప్పుడు ముఖ్యమైన పని శవాన్ని అదృశ్యం చేయడం.

ఇద్దరు కుర్రాళ్లు కాలువలో దిగి అతడి శరీరాన్ని దహనం చేయటానికి అనువైన స్థలాన్ని నిర్ధారిస్తున్నారు. మరో ఇద్దరు అతడి బట్టల్ని విప్పుతున్నారు.

నేను ఒక చెట్టుకి ఆనుకొని నిర్లిప్తంగా చూస్తున్నాను. అతడి శరీరంలో అండర్‌వేర్‌ని తప్ప మిగతా బట్టల్ని తీశారు. అతడి శరీరంలో నాకు ఏ మార్పు కనబడలేదు.

నిద్రపోతున్నవాడిలా కనిపిస్తున్నాడు.

తర్వాత అతడి శరీరాన్ని పై నుండి తోస్తూ కిందికి దించారు. దాదాపు పదిలీటర్ల కిరోసిన్ కలిపిన పెట్రోల్ శరీరం మీద పోశారు. నేను మనసులోనే అతడికి చివరి సెల్యూట్ చేశాను. శరీరం నుండి కొంచెం దూరంలో నిలబడి ఒక వ్యక్తి అగ్గిపుల్ల గీశాడు.

ఎవరూ ఊహించని ఒక చిన్న పొరపాటు జరిగింది. నాలుగు అడుగుల ఎత్తు, రెండడుగుల వెడల్పు కాలువ అది. అగ్గిపుల్ల గీసిన వ్యక్తి ఐదడుగుల దూరంలో ఉన్నాడు. పెట్రోల్‌కి నిప్పు అంటుకున్నప్పుడు కళ్లు మూసి తెరిచేంతలో భగ్గున నిప్పు అంటుకుని మంటలు అన్ని వైపులా వ్యాపించాయి. కానీ అది కాలువ కాబట్టి, మంటలు కాలువ పొడవునా ఎంతో వేగంగా వ్యాపించాయి.

దీన్ని ముందుగా ఊహించని కుర్రాళ్లు, మంటల్ని చూసి భయంతో ఉలిక్కిపడ్డారు. వారివైపు మంటలు వేగంగా పాకసాగాయి; కాలువ చివరి అంచు వరకు, అంటే దాదాపు పాతిక అడుగుల వరకు కుర్రాళ్లు వేగంగా పరిగెడుతూ పైకొచ్చారు.

కుర్రాళ్ల కాళ్ల పాదాల చర్మం అక్కడక్కడ కాలిపోయింది. కనుబొమ్మలు సైతం సగానికి పైగా కాలిపోయాయి. ఆ చలికి గాయల మంట ఎక్కువై బాధతో గిలగిల్లాడసాగారు.

పదినిమిషాల్లో అందరం బాస్ దగ్గరికెళ్లాం.

మేము పెట్రోల్ పోసి నిప్పంటించిన స్థలం ఇంటి నుండి చాలా దూరం ఉన్నప్పటికీ, దట్టమైన చీకటిలోనూ దాని జ్వాలలు అంత దూరంలోనూ ప్రజ్వలిస్తూ కనిపిస్తున్నాయి.

ఆ మంటల్ని చూస్తూ, ఎవరైనా భయంతో, ఆశ్చర్యంతో రావచ్చని బాస్ భయపడ్డాడు.

కానీ అలాంటిదేం జరగలేదు.

బాస్ నన్ను కూర్చోపెట్టుకొని అతడి హత్య గురించిన వివరాలడిగారు.

అతడు చావుకు సిద్ధంగా ఉన్న మనస్థితిని, ఎదురించిన ధైర్యాన్ని వివరంగా చెప్పినప్పుడు బాస్ మౌనంగా ఉండిపోయాడు.

సిగరెట్ వెలిగించుకొని 'చూడండి, మనమంతా అండర్‌వరల్డ్ మనుషులం. హత్య చేయటాన్ని అలవాటుగా మార్చుకున్నవాళ్లం. ఎక్కడో కూర్చున్న డాన్‌లు నిరంతరంగా ఒకరి తర్వాత మరొకరిని మనతో హత్య చేయిస్తూ ఉంటారు. ఈ డాన్‌లు ఎప్పుడైనా, ఎవరికైనా ప్రాణం పోశారా? వీరితో ఇది సాధ్యమవుతుందా? చరిత్రలో డాన్‌లు ఏ ఒక్క మనిషినైనా రక్షించిన సంఘటన ఏదైనా ఉందా? ఛ!' అంటూ ఉద్వేగంతో విసుగుని వ్యక్తపరిచాడు.

మరుసటిరోజు ఉదయం వేం బెంగుళూరుకి వెళ్లి పోవాలని నిర్ణయించుకున్నాం. కానీ మాతోపాటున్న ఇద్దరు కుర్రాళ్లకి కాలిన గాయాలైనందువల్ల నేను, వాళ్లిద్దరితో, నా అనుచరుడితో ఆ రాత్రే బయలుదేరాను.

హాసన్‌లో ఇద్దరికీ ఫస్ట్‌ఏడ్ చేయించుకొని ఉదయం ఐదుగంటల సమయానికి బెంగుళూరు చేరి, వాళ్లిద్దరినీ ఒక నర్సింగ్ హెూమ్‌లో అడ్మిట్ చేశాను.

తర్వాత నాకు నిద్ర పట్టలేదు.

అతడు చావుని స్వీకరించిన పద్ధతి, ఎదురించిన వైఖరి నన్ను పూర్తిగా కలవరపెట్టసాగింది.

ఏడుగంటల సమయంలో అతడు తన స్నేహితురాలికి ఫోన్ చేయమని చెప్పిన సంగతి గుర్తుకొచ్చింది. అతడు చూపిన నమ్మకానికి నేను చేయగలిగిన సహాయం ఇదొక్కటే అని నిర్ణయించి వెళ్లి ఫోన్ చేసాను.

ఎవరో మగవాళ్లు ఫోన్ తీసుకున్నారు. తర్వాత రశ్మీకి ఇచ్చారు.

నేను అతడి పేరు చెప్పి, అతడి స్నేహితుడిగా పరిచయం చేసుకున్నాను. ఆమె ఏ రకమైన భావం వ్యక్తపరచలేదు. చాలా సౌమ్యంగా, శాంతంగా అడిగింది విషయమేమిటని. నేను నెమ్మదిగా అతడు యాక్సిడెంట్‌లో రెండు రోజుల క్రితం చనిపోయాడని చెప్పాను.

ఆ అమ్మాయి ఆర్ద్రమైన గొంతుతో అడిగింది. 'అతడు చనిపోయాడు అని నాకు తెలిసింది. ప్రతిరోజూ రాత్రి ఫోన్ చెయ్యటం ఆగిపోయినప్పుడే నేను దు:ఖాన్ని ఎదురించటానికి మానసికంగా సిద్ధమయ్యాను. కాకతాళీయంగా నిన్న ఉదయం కలలోకి కూడా వచ్చాడు. 'వెళ్లిపోతున్నాను క్షమించు' అని చెప్పాడు' ఆమె గొంతు తడారిపోసాగింది.

కల సంగతి వింటూనే నా చెవులు జాగృతమయ్యాయి. నిన్న అతడు కలలో తను రశ్మీతో మాట్లాడనని మరీ చెప్పాడు.

'నిన్న కలలో మీరు ఏ డ్రెస్ వేసుకున్నారు' ఉద్వేగంగా అడిగాను.

'ఎందుకు?'

'ప్లీజ్!'

'తెలుపు రంగు సల్వార్ కమీజ్ అనుకుంటాను' అని చెప్పి, 'ఆ విషయాన్ని ఎందుకంత సీరియస్‌గా అడుగుతున్నారు?'

'నిన్న అతడు ఇదే కల గురించి నాకు చెప్పాడు.'

'అంటే అతడు రెండురోజుల క్రితం చావలేదు?' ఆమె గొంతు వణుకుతుంది. దు:ఖం కట్టలు తెంచుకోసాగింది.

'దేవుడు నిన్ను చల్లగా చూస్తాడు. టేక్ కేర్...' అని మాత్రం చెప్పి ఫోన్ పెట్టేసాను.

❖ ❖ ❖

నేను ఇప్పటికీ ఆలోచిస్తుంటాను. అతడి హత్య – అది హత్య కాదని నా ప్రగాఢమైన నమ్మకం. ఇందులో నా తప్పేమిటి? నేను ఎంతవరకు దీనికి బాధ్యుణ్ని?

ఏవిధంగానూ నేను బాధ్యుణ్ని కానని నన్ను నేనే ఓదార్చుకుంటాను.

కానీ ఒంటరిగా ఉన్నప్పుడు, అతడి ముఖం నా కళ్ల ముందు కదిలినప్పుడు, నాకు తెలియకుండానే నేను అడుగుతాను... నేస్తమా నన్ను మన్నించు.


❖

# తెగింపు

కన్నడ మూలం : అగ్ని శ్రీధర్
తెలుగు అనువాదం : సృజన్

అతడు సిగరెట్ వెలిగించాడు

'బెంగళూరు ఫీల్డ్‌కి ముంబై ఫీల్డ్‌కి చాలా ఫరక్ ఉంది.
మీరిక్కడ ఒక వ్యక్తిని ఫినిష్ చేయాలంటే చాలా సార్లు అట్యాక్ చేస్తూ ఉంటారు. ఆ వ్యక్తులు చాలా సార్లు తప్పించుకుంటారు కూడా. కానీ మేమలా కాదు. మేము ఊరికే చెయ్యి వేయం. సరిగ్గా ఫీల్డింగ్ చేసి ఒకేసారి గురి పెడితే అంతే. నా భాయ్ నాకు నేర్పింది దీన్నే. నీ మీద అట్యాక్ జరిగి, నీ చావు ఖాయం అనిపిస్తే ఊపిరి బిగపట్టి మౌనంగా ఉండిపో. తప్పించుకోవటానికి ప్రయత్నించవద్దు. అప్పుడు కేవలం చావుని మాత్రం కాదు నరకాన్ని కూడా అనుభవించాల్సి వస్తుంది. బాధపడుతూ చచ్చేది పిరికివాళ్లు మాత్రమే. మనుషుల్ని చంపే మనం చావటానికి కూడా సిద్ధంగా ఉండాలి. నిజంగా మన సామర్థ్యం తెలిసేది, మనం చావుని ఎదురించగలం అన్న మాట మీద' అని చావు గురించి తన అభిప్రాయాన్ని వివరించాడు.



It is about a contract killer from Mumbai, who arrives in Bangalore to kill an underworld don, but ends up being cornered by the don himself. When the killer realises that there is no escape, he faces it with equanimity. He remains calm and composed even when he knows his end is near...very near...

'TEGIMPU ('YEDEGARIKE' in Kannada) is written by Agni Sridhar, who, long time ago, was actually participated in one act of cold blooded 'killing'. Perhaps, it is first of its kind in the history of serious literature where a man who is involved in an execution himself records his feelings and honestly throws it open for the public judgement.

'TEGIMPU' is not only about the impact of love on the psyche of a killer, but also about the friendship, trust and treachery in the face of an impending death.

Here go...

Confessions of a professional killer.

సూఫి ప్రచురణలు